ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 6 జూన్ 2025

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: కలెక్టర్

6

రూ.26 లక్షలతో రైతుబజారు ఏర్పాటు

● రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : ఏడీ

పచ్చదనం పెంపునకు కృషి చేయాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



మొక్కలు నాటుతున్న కలెక్టర్

రాజంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజంపేట శివారులోని నగరవనంలో గురువారం పలువురు మొక్కలు నాటారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, అరవ శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనంతో నింపాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలో పచ్చదనం పెంపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 4.36 లక్షలు మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే వన మహోత్సవ నాటికి 21 లక్షల మొక్కలను పెంచేవిధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోవత్సంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై పర్యావరణాన్ని రక్షించాలని తెలిపారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి కృషి చేసి పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్‌లు నిధియాదేవి, మేఘస్వరూప్, డీఎఫ్‌వో ఆర్.జగన్నాథ్‌సింగ్, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, సబ్ డీఎఫ్‌వోలు జి.సుబ్బరాజు, ఎస్.శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు సాయిలోకేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు కేంద్రాల్లో మెగా డీఎస్సీ పరీక్ష

● ఒకటిన్నర గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి

● నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి (కలెక్టరేట్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 6 కేంద్రాల్లో మెగా డీఎస్సీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6 కేంద్రాల్లో ఈనెల 6 నుంచి 27వ తేదీ వరకు మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 17,851 మంది పరీక్షకు హాజరవుతున్నారని, మదనపల్లెలో మూడు కేంద్రాలు, రాజంపేటలో ఒక కేంద్రం, రాయచోటిలో రెండు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరుగుతుందని, ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒకటిన్నర గంట ముందే పరీక్ష హాలుకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించబడరని, పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని చెప్పారు. సమావేశంలో డీఈవో సుబ్రమణ్యం, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలు

● జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలు ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. 9వ తేదీ సూర్య నమస్కారం, యోగాసనాలు, 10న యోగాపై క్విజ్, 11న యోగాపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం, 12న యోగాపై పెయింటింగ్, 13న యోగాపై వ్యాసరచన, 14న యోగాపై స్కిట్, రోల్‌ప్లేలు ఉంటాయన్నారు. మండల స్థాయి పోటీల్లో గెలిచిన వారికి ముందుగానే మాస్టర్ ట్రైనర్స్ సమాచారం అందించాలన్నారు. పై అంశాలపై జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న వారి వివరాలు, గెలుపొందిన వారి వివరాలను, ఫొటోలను, ఒక నిమిషం వీడియోతో సహా అదేరోజు ఉదయం 11 గంటల లోపు కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. అనంతరం వారిని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పంపుతామన్నారు.

కార్డు కోసం కష్టాలెన్నో..!

● చస్తేనే తీసేస్తారు.. పత్రాలు ఇస్తేనే విభజిస్తారు..!!

● మ్యారేజ్ మైగ్రేషన్‌కే అవకాశం ● హౌస్‌హోల్డ్ విభజనకు సంకెళ్లు

● రేషన్‌కార్డు అర్హతపై ఇబ్బందులెన్నో...!



మదనపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు కొలమానంగా భావించే రేషన్‌కార్డు (రైస్ కార్డు) పొందడం ప్రజలకు క్లిష్టతరంగా మారింది. కొత్త కార్డు పొందడమే కాదు... ఇప్పటికే ఉన్న కార్డులో మార్పులు, చేర్పులు, తొలగింపులు, కార్డు నుంచి వేరుకావడం, తదితర అంశాలపై ఇబ్బందులు తప్పడం లేదు. కర్నుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు ఇక్కడ రైస్‌కార్డు బాధితుల కష్టాలకూ దాదాపు అవే కారణాలు, కొర్రీలు, అడ్డంకులు ఉన్నాయి. వీటిని తొలగిస్తే గానీ నిజమైన లబ్ధిదారుడు రేషన్‌కార్డు పొందడం అంత ఈజీ కాదని స్పష్టమవుతోంది. వీటికి ప్రతిబంధకంగా మారిన హౌస్‌హోల్డ్ స్లిట్ (విభజన) ఆప్షన్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే గాని అందరికీ అవకాశం ఉండదు. ప్రస్తుతం అమలులో ఉన్న రైస్‌కార్డు స్లిట్ (విభజన)తో కొందరికే లబ్ధి చేకూరుతుండగా, మిగిలిన అర్హులంతా బాధితులుగా మారి లబోదిబోమంటున్నారు. ఇందుకోసం సచివాలయానికి వెళ్లిన బాధితులు అక్కడ నమోదులో ఎదురవుతున్న అంక్షలు, ఇబ్బందులతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్‌కార్డు పొందడానికి, అందులోని ఇతర సేవలకు అవకాశం కల్పిస్తూ గత నెల ఏడో తేదీ సైట్ ఓపెన్ చేసింది. ఇందులో కొత్తకార్డు నమోదుకు, ఇప్పటికే ఉన్న కార్డును విభజన చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది కానీ కుటుంబంలోని సభ్యులను విభజన చేసుకోవడానికి గేట్లు మూసేసింది. రైస్‌కార్డుకు సంబంధించిన అన్ని సేవలూ దాదాపు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌తో ముడిపడి ఉండటంతో సమస్యకు కారణమవుతోంది. ఇందులోని చిక్కులు లోతుగా ప్రజలకు అవగాహన లేకపోవడంతో వారి ఆందోళన, అపోహలకు కారణమవుతోంది. ఈ క్రమంలో అటు సచివాలయం, ఇటు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిన బాధితులు చివరకు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి, ఇతర పథకాల కోసం సభ్యులను రిలేషన్‌తో సంబంధం లేకుండా ఇష్టానుసారం రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హౌస్‌హోల్డ్ విభజన లేకుండా ఆంక్షలు పెట్టడంతో వారంతా ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. ఫలితంగా కొత్తకార్డు సంగతి దేవుడెరుగు ఉన్న కార్డులో నుంచి బయటకు వచ్చేస్తామన్నా అవకాశం లేదు. చనిపోతేగానీ ప్రస్తుతం వారిని తొలగించే ఆప్షన్ లేదు. హౌస్‌హోల్డ్ విభజన ఇస్తే కార్డుల సంఖ్య పెరగడంతో పాటు అర్హులందరికీ అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాత డేటాబేస్‌తోనే ఆప్షన్ ఉంది. గతంలో ప్రభుత్వం అమలు చేసిన 1000 చ.అ. ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, 300 యూనిట్ల కరెంటు బిల్లు, ఇన్‌కం ట్యాక్సు పేయర్, 10 ఎకరాల భూమి, తదితర పాయింట్లతో కూడిన డేటా బేస్‌తో ఆప్షన్ అమలులో ఉంది. ఇందులో మార్పులు, చేర్పులతో పాటు రిలేషన్‌తో కూడి కండీషన్లతో అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదాహరణలు పరిశీలిస్తే..

మదనపల్లె పట్టణం ఆంజనేయస్వామిగుడి వీధికి చెందిన ఓ కుటుంబంలో ముగ్గురు సభ్యులతో కూడిన రేషన్‌కార్డు ఉంది. కుటుంబ పెద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. భార్య విడో పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే కార్డులో ఉన్న ఇద్దరు కుమార్తెలకూ పెళ్లయింది. వీరు ఆ కార్డులో నుంచి భర్తల కార్డులోకి వెళ్దామంటే వీలు కావడం లేదు. ఒక కుమార్తె మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ బేసిక్‌లో ఉద్యోగం చేస్తుండగా ప్రభుత్వ ఉద్యోగిగా నమోదైంది. దీంతో భర్త కార్డులో చేరుదామంటే అక్కడ వారు ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే వారికి ఇప్పటికే వస్తున్న బియ్యంతో పాటు కార్డు కూడా రద్దయ్యే అవకాశం ఉంది. ఇక్కడే ఉందామంటే అమ్మకు వితంతు పింఛన్‌కు అడ్డుగా ఉంది. ఇక రెండో కుమార్తె అంశానికి వస్తే ఆమె గృహిణి. అయితే ఆమె భర్తకు రేషన్‌కార్డు లేదు. ఒక సభ్యుడు కార్డులో నుంచి మరో చోటికి వెళ్లాలంటే ఎక్కడో చోట రేషన్ కార్డు ఉండాలి. అందులో రిలేషన్‌తో కూడిన చోటు కూడా ఉండాలి. అది తల్లిదండ్రుల కార్డు లేదా భర్త కుటుంబానికి సంబంధించిన కార్డు అయి ఉండాలి. ఇప్పటికే తల్లిదండ్రుల కార్డులో ఉంటే పెళ్లయిన తర్వాత మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా..పెళ్లి కార్డుతో భర్త కార్డులో చేరితే తర్వాత తల్లిదండ్రుల కార్డు నుంచి డిలిట్ అవుతున్నారు. తర్వాత హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌తో భార్యాభర్తలు, తల్లిదండ్రుల కార్డు నుంచి వేరయి కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ కార్డు విషయంలో ఇద్దరు పిల్లలు మాకు రేషన్ బియ్యం వద్దు, రేషన్ కార్డు అంతకంటే వద్దు.. మమ్మల్ని ఇక్కడి నుంచి తీసేస్తే చాలని వేడుకుంటున్నా..అవకాశం లేక చచ్చినట్లు ఉంటున్నారు. ఇక కార్డులో నుంచి వెళ్లి పోవాలంటే ఏకంగా పైకి పోవాల్సిందేనా అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.

- స్థానిక నక్కలదిన్నెకు చెందిన ఓ కుటుంబంలో నలుగురు సభ్యులు ఉండగా, కుటుంబ యజమాని అయిదేళ్ల క్రితం మరో మహిళతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇక మిగిలిన భార్య, ఇద్దరు పిల్లలతో కలసి కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వెళితే తిరస్కరిస్తున్నారు. భర్త అయినా ఉండాలి. లేదంటే విడిపోయినట్లు, చనిపోయినట్లు ధ్రువీకరణ పత్రం కావాలని అడుగుతున్నారు. కుటుంబంలో చిన్న చిన్న తగాదాలతో భార్య భర్త దూరంగా ఉన్నారని చెబుతున్నా..అలా కుదరదని చెబుతున్నారు. ఇక రేషన్‌కార్డు కోసం ఇక మరో పెళ్లి అయినా చేసుకోవాల్సిందేనా? అంటూ బాధితురాలు ప్రశ్నిస్తున్నారు.
- స్థానిక బుగ్గ కాలువకు చెందిన ఓ కుటుంబంలో నలుగురు సభ్యులు రేషన్‌కార్డులో ఉన్నారు. తర్వాత భార్యాభర్తలు అధికారికంగానే విడిపోయారు. ఇప్పుడు ఆయనను రేషన్‌కార్డులో నుంచి తీసేద్దామంటే కుదరడం లేదు. 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉండీ, ఎవరూ లేకుండా ఉంటే అలాంటి వారికి సింగిల్ మెంబర్‌తో కొత్త కార్డు ఇస్తారు. కానీ ఈయన వయసు 48 ఏళ్లు. మరో పెళ్లి కూడా చేసుకున్నాడు. రెండో భార్య కార్డులో చేర్చే అవకాశం లేదు. ఇక్కడ విడాకులు ఇచ్చిన భార్య మాత్రం ఆయన తన కార్డులో వద్దు తీసేయండని సచివాలయం చుట్టూ తిరుగుతోంది. కానీ రెండు పెళ్లిళ్ల భర్తని తీసేయడానికి, మరోచోట చేర్చడానికి దారులన్నీ మూసేశారు. ఒక కార్డులో నుంచి మరో కార్డులోకి మారాలంటే ఒక మ్యారేజ్ అయిన వారికే అవకాశం ఉంది.
- మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన ఓ కుటుంబంలో తల్లీతండ్రీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులకూ పెళ్లి అయింది. వీరంతా ప్రస్తుతం ఒకే కార్డులో ఉన్నారు. వీరిని సపరేట్ చేయాలంటే ఒకే ఇంట్లో మ్యాపింగ్ అయ్యారు. వీరిని విడదీసే ఆప్షన్ లేదు. ఉన్న కార్డు ఒకరికి పెట్టి మరొకరికి కొత్తకార్డు ఇవ్వమన్నా..ఆ అవకాశం లేదు.
- స్థానిక చెంబకూరు రోడ్డుకు చెందిన ఓ కుటుంబంలో ఇద్దరు పిల్లలు ఉండగా, అందులో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. ప్రస్తుతం వారు కొత్త కార్డు నమోదుకు వెళ్తే, ఇన్‌కంట్యాక్సు పేయర్‌గా చూపెడుతోంది. ఇతన్ని వేరు చేస్తే కానీ మిగిలిన వారికి కార్డు రాదు. పిల్లల్ని సాకుగా చూపి మమ్మల్ని ఇబ్బందులు పెడతారా? అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.

గతంలో అమ్మఒడి కోసం తల్లిదండ్రులు తమ పిల్లల్ని, అమ్మానాన్నా, అత్తమామల రేషన్‌కార్డులో చేర్చి, ఒకరి కంటే, ఎక్కువ మంది పిల్లలకు అమ్మఒడి లబ్ధి పొందారు. ప్రస్తుతం వారంతా ఎక్కడి వారు అక్కడే ఉండిపోవాల్సి వస్తోంది. తిరిగి అవ్వాతాతల నుంచి..అమ్మానాన్న కార్డులోకి చేరే అవకాశం లేకుండాపోయింది. వీరిని అక్కడి నుంచి తీసి వేరో కార్డులో చేరుస్తుంటే రేషన్‌కార్డుకు అనర్హులుగా ఆప్షన్ చూపుతోంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే ఇలాంటి ఉదాహరణలు, ఉదంతాలు కోకొల్లలు ఆన్‌లైన్ వ్యవహారంలో బయట పడుతున్నాయి.

బక్రీద్ రోజున ఆవులు, ఒంటెల వధ వద్దు

● ఏఎస్పీ రామ్‌నాథ్ హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

రాజంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ రోజున జంతువధ వద్దని, అది చట్టరీత్యా నేరమని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ముస్లింలకు, హిందువులకు సూచించారు. ఎవరైనా పవిత్రమైన ఆవులు, ఒంటెలను వధిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఏఎస్పీ కార్యాలయంలో రాజంపేట పట్టణంలోని హిందువులు, ముస్లింల ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేదమని, ఈ ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై జంతుహింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో హిందూ ముస్లింలు ఐకమత్యంగా సోదరభావంతో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం మొక్కలు పెంచాలి

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న చమర్తి జగన్‌మోహన్ రాజు, కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భావితరాల కోసం కన్నబిడ్డల్లా ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచుకోవాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం మన్నూరు హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడ సాధించాలంటే పర్యావరణం ఎంతో అవసరమని పర్యావరణం కాపాడుకోవాలంటే మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను ఎలా చూసుకుంటారో అలా మొక్కలను కాపాడుకుంటే భవిష్యత్ బంగారమయంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గంజాయితో జీవితం నాశనం

బాలల సంరక్షణ జిల్లా అధికారి వినోద్‌కుమార్

6

ఏడాది పాలనలో రూ.40 కోట్లతో అభివృద్ధి

పది విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

● మండలానికి ఆరుగురి ఎంపిక

● ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి

● 9న కలెక్టరుచే ప్రదానం

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం గురువారం ప్రతిభ అవార్డులను ప్రకటించింది. ప్రతి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఆ మేరకు జాబితా విడుదల చేశారు. ప్రతి మండలాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఇద్దరు ఓసీలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒక్కొక్కరి వంతున, కులానికి సంబంధం లేకుండా ఒక బాలికకు కలిపి మొత్తం మండలానికి ఆరు పురస్కారాలు ప్రకటించారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల వంతున ఒకే దఫాగా అందజేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో ప్రతిభ పురస్కారాలు పొందిన మొత్తం వారందరికీ ఈనెల 9న రాయచోటిలో కలెక్టరు చామకూరి శ్రీధర్ నగదును అందచేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆణిముత్యాల పేరుతో ప్రతిభ పురస్కారాలను ఐదేళ్లలో కేవలం ఒక ఏడాది మాత్రమే ప్రకటించింది. ఎన్నికలు, ఫలితాలు, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కారణంగా గత సంవత్సరం ఈ అవార్డులు ప్రకటించలేదు. కాగా గతంలో ఈ పురస్కారాలను ప్రభుత్వ పాఠశాలల వరకు మాత్రమే పరిమితం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలను కూడా పరిగణనలోకి తీసుకుంది.

తంబళ్లపల్లెను దోచుకున్న పెద్దిరెడ్డి

● దమ్ముంటే రాజీనామా చెయ్యి

● నిన్ను ఓడించకపోతే తంబళ్లపల్లెను వదిలి వెళ్తా

● ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాలిబన్ల తరహాలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని దోచుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో తంబళ్లపల్లెలోని సహజ వనరులను దోచుకోవడంతో పాటు భూములను లాక్కుని దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేసిన ఘటనలు ప్రజలు మరిచిపోలేదన్నారు. నిజంగా ప్రజల మద్దతుతో ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యే అయితే దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రా నిన్ను ఓడించకపోతే తంబళ్లపల్లెను వదిలి వెళ్లిపోతానని సవాల్ చేశారు. వెన్నుపోటు దినం పేరుతో ర్యాలీ చేపట్టి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. పుంగనూరు, తిరుపతి నుంచి గంజాయి బ్యాచులను పిలుచుకొచ్చి ప్రజలను భయభ్రాంతులను చేసే విధంగా ములకలచెరువులో ర్యాలీ చేశారన్నారు. ముదివేడు రిజర్వాయర్, జీఎన్ఎస్ఎస్ పనులతో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా కడుపు కొట్టావన్నారు. మల్లయ్యకొండ మూల విగ్రహాన్ని మాయం చేసి ప్రజల భూములు లాక్కుని, వనరులను దోచేసిన ద్వారకనాథరెడ్డికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే రూ.300 కోట్లతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల కన్వీనర్లు వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటలో
చిన్నమండెం బాలిక మృతి



స్వగ్రామానికి తరలించిన బాలిక మృతదేహం



దివ్యాన్షి (ఫైల్‌ఫోటో)

రాయచోటి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) ఐపీఎల్ ఫైనల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) గెలుపొందిన సందర్భంగా బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేడుకల్లో జరిగిన తొక్కిసలాటలో చిన్నమండెం మండలం వండాడికి చెందిన దివ్యాన్షి (15) అనే బాలిక మృతి చెందింది. గురువారం సాయంత్రం ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. బెంగళూరులో పదో తరగతి చదువుతున్న బాలిక తన తల్లి, నానమ్మ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విజయోత్సవ వేడుకలను తిలకించేందుకు బుధవారం మధ్యాహ్నం చిన్నస్వామి స్టేడియానికి వెళ్లారు. లక్షలాది వచ్చిన అభిమానుల మధ్య ఒక్కసారిగా తోపులాట జరగడంతో బాలిక కిందపడిపోయింది. ఆమె మీద గుంపులుగా జనం వెళ్లడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించేలోపే చనిపోయింది. మృతురాలి తండ్రి శివకుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి అశ్విని. వీరికి కుమారుడు (6) ఉన్నాడు. ఈ దుర్ఘటనతో బాలిక స్వగ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలిక మృతదేహాన్ని చూసేందుకు బంధువులతో పాటు గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: కలెక్టర్



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

పుల్లంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమంగా సక్రమంగా చేపట్టాలని, ఏ మాత్రం తేడా వచ్చినా చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని రెడ్డిపల్లెలోని చౌకదుకాణం-8ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఏయే సమయాల్లో సరకులు ఇస్తున్నారు ? ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారని ప్రశ్నించారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు ఎంతమంది ఉన్నారని తహసీల్దారు అరవింద కిశోర్‌ను ప్రశ్నించారు. అనంతరం అనంతంపల్లె గ్రామంలో ఉన్న 65 ఏళ్ల పైబడిన బి.వెంకటసుబ్బమ్మ ఇంటికి వెళ్లి కలెక్టర్ స్వయంగా సరుకులు పంపిణీ చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి



మొక్కలు నాటుతున్న డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి

సిద్దవటం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దవటం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో జనాభా పెరగడం వల్ల ఉన్న చెట్లను కూడా తొలగించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించారని, పర్యావరణం పెంచేందుకు ప్రతిఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పెంపకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ హరిప్రసాద్, మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి, ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

గీతలు... నియమాల సూచికలు !

● ట్రాఫిక్ నిబంధనలు సూచించే రోడ్డు మీద లైన్లు

● వాటి గురించి తెలుసుకోవాలంటున్న నిపుణులు

పీలేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు బాగా పెరిగాయి. మితిమీరిన వేగంతో పాటు ఓవర్‌టేక్ చేసే సమయంలో వాహనాలు అదుపు తప్పడం పరిపాటిగా మారింది. డ్రైవర్ల అతి ఆత్మవిశ్వాసం, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్న వ్యక్తిగత క్రమశిక్షణ లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన రంగ నిపుణులు, పోలీసుల అభిప్రాయం. పరిసరాలను క్షుణ్ణంగా గమనిస్తే మనం ప్రయాణించే రోడ్డే మనకు ట్రాఫిక్ నియమాలు చెబుతుందని మోటారు వాహనాల తనిఖీ అధికారులు, వాహనరంగ నిపుణులు చెబుతున్నారు. మనం నిత్యం ప్రయాణించే రోడ్లపైనే ఉండే తెల్లని గీతలు ఆయా రోడ్లలో పాటించాల్సిన నియమాలు చెబుతాయని, వాటి గురించి కనీస అవగాహన చేసుకుని, కాసింత సంయమనంతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని వారి సూచన.



పీలేరు-కడప మార్గంలో కోటిగారిపల్లె వద్ద ఉన్న జీబ్రా క్రాసింగ్

వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఎంత ముఖ్యమో రోడ్ల మీద ఉండే గీతల గురించి అవగాహన కూడా అంతే ముఖ్యమని వారు చెబుతున్నారు. సాధారణంగా రోడ్డు మీద కనిపించే తెల్లని గీతలు రోడ్డును రెండు భాగాలుగా విభజించడానికి ఉన్నాయని చాలా మంది భావిస్తారని, అయితే ఆ గీతల వల్ల మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

జీబ్రా క్రాసింగ్

పాదచారులు రోడ్డు దాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి వీటిని ఏర్పాటు చేస్తుంటారు. పట్టణాల్లో గానీ, మారుమూల ప్రాంతాల్లో గానీ రహదారులపై జీబ్రా క్రాసింగ్స్‌ను గమనించినప్పుడు వాహనాలను విధిగా నెమ్మదిగా నడపాలని అర్థం. జీబ్రా క్రాసింగ్స్ వద్ద పాదచారులు రోడ్డు దాటే అవకాశం ఉంటుంది గనుక వాహనదారులు తమ వాహనాలను ఆ ప్రాంతాల్లో కాసింత నెమ్మదిగా నడపాలని ఇవి సూచిస్తాయి. వీటితో పాటు జాతీయ రహదారుల్లో మనకు కనిపించే మరిన్ని లైన్ల గురించి తెలుసుకుని వాహనం నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

డబుల్ అన్‌బ్రోకెన్ లైన్స్



వీటిని ఎక్కువగా ఘాట్ రోడ్లలో వేస్తుంటారు. డబుల్ అన్‌బ్రోకెన్ వైట్ లైన్స్ లేదా ఎల్లో లైన్స్‌గా వీటిని పిలుస్తారు. ఇవి ఉన్న చోట వాహనాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఓవర్‌టేక్ చేయకూడదు.

ఎల్లో స్పీడ్ బంప్స్



బోడుమల్లువారిపల్లె వద్ద ఉన్న స్పీడ్ బంప్స్

గతంలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు వేస్తుండిన ఎత్తైన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో ప్రస్తుతం ఎల్లో స్పీడ్ బంప్స్‌ను వాడుతున్నారు. రోడ్ల నాణ్యత, వాహనాల సామర్థ్యం, వాహనదారుల్లో అవగాహన బాగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి స్వస్తి పలికి వాటి స్థానంలో స్పీడ్ బంప్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మలుపులు, ఘాట్ రోడ్డు, లోతైన ప్రాంతం సమీపిస్తున్నప్పుడు వీటిని ఎక్కువగా వేస్తుంటారు. కేవలం మీటర్ల దూరంలో వీటిని మూడు, నాలుగు స్థానాల్లో వేస్తుంటారు. ఇవి కనిపించినప్పుడు వాహన వేగం తగ్గించాలని, వీలైనంత నెమ్మదిగా వెళ్లాలని స్పీడ్ బంప్స్ సూచిస్తాయి.

రోడ్డుపై ఉండే గీతల గురించి తెలుసుకోవాలి

● విజయకుమారి, ఎంవీఐ, పీలేరు



వాహనదారులకు లైసెన్స్ ఎంత ముఖ్యమో రోడ్డు నిబంధనలు సూచించే గీతల గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. లైసెన్స్ పొందిన తరువాత తమకు అంతా తెలుసునన్న భావనతో చాలా మంది తమ వాహనాలతో రోడ్డుపైకి వచ్చేస్తుంటారు. లక్షలు ఖరీదు చేసే వాహనం తమ చేతుల్లో ఉందన్న ఆత్మవిశ్వాసంతో ట్రాఫిక్ నిబంధనల గురించి పెద్దగా ఆలోచించరు. వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉండే రహదారుల గురించి వాహనదారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో రోడ్ల మీద వివిధ ఆకారాలు, రంగుల్లో లైన్లు ఏర్పాటు చేస్తారు. వాటిని సూచించే నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

బ్రోకెన్ వైట్ లైన్స్

జిల్లాలోని అత్యధిక రోడ్లలో అత్యధిక భాగం బ్రోకెన్ వైట్ లైన్స్ మనకు కనిపిస్తాయి. వీటిని రోడ్డును రెండు భాగాలుగా విభజించడానికి వేశారని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అయితే వాటి అర్థం కేవలం రోడ్డు విభజన మాత్రమే కాదని, వాహన దారులకు ఆ రోడ్డు గురించి ఆ లైన్లు తెలియ జేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బ్రోకెన్ వైల్ లైన్సు ఉన్న చోటు మాత్రమే తమ పక్కనున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయవచ్చునని, ట్రాఫిక్ లేని సమయంలో యూటర్న్ కూడా తీసుకోవచ్చని సూచిస్తాయి.



పీలేరు-మదనపల్లె మార్గంలో బ్రోకెన్ వైట్ లైన్స్



పీలేరు-చిత్తూరు మార్గంలో అన్‌బ్రోకెన్ వైట్ లైన్

అన్‌బ్రోకెన్ వైట్ లైన్స్

వీటిని ఎక్కువగా మలుపుల్లో చూస్తుంటాం. మనం ప్రయాణిస్తున్న ప్రాంతం మలుపుగా ఉందని ఈ అన్‌బ్రోకెన్ లైన్స్ సూచిస్తాయి. ఇవి ఉన్న చోట ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు. ఎదురుగా వెళుతున్న వాహనం వెనుకాల క్యూ పద్ధతిలో వెళ్లాలి. ఈ లైన్లు ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేస్తుంటారు. ఒకవేళ అన్‌బ్రోకెన్ లైన్ కుడి చేతి వైపు ఉంటే ఓవర్‌టేక్ చేయ వచ్చని అర్థం. ఎడమ చేతివైపు ఉంటే ఓవర్‌టేక్ చేయకూడదని అర్థం.

పీలేరులో ఆర్డీఓ విస్తృత పర్యటన



పీలేరు-మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు

పీలేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ గురువారం పీలేరులో విస్తృతంగా పర్యటించారు. రీ-సర్వే జరుగుతున్న గూడరేవుపల్లెను సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పీలేరు పంచాయతీ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయంలో మొక్కలు నాటారు. సినిమా థియేటర్ లైసెన్సు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న జీవీసీఎస్ఆర్ థియేటర్‌ను తనిఖీ చేశారు. పీలేరు-తిరుపతి మార్గంలోని రజకుల గుట్ట వద్ద ఏపీ టూరిజం శాఖకు కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. ఆర్వోబీ నిర్మాణానికి అడ్డంకిగా మారిన రైల్వే లెవల్ క్రాసింగ్ స్థల మార్పుపై కొత్త ప్రదేశాన్ని పరిశీలించారు. రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే కొత్త లెవల్ క్రాసింగ్ పనులు ప్రారంభించాలని ఆర్వోబీ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. పీలేరు వారపు సంత వద్ద వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూఆక్రమణలను పరిశీలించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు భీమేశ్వర రావు, సర్వేయర్లు కీర్తన, ప్రభంద, వీఆర్వోలు సిద్దయ్య, రెడ్డిశేఖర, సుధాకర్, కల్యాణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి ప్రతిభ అవార్డులు



కలికి విద్యార్థినీలు శిరీష, దివ్య, లక్ష్మీప్రియ, సలోని

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల స్థాయిలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులను ప్రకటించినట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జీవన్‌కుమార్, గోవర్ధనరెడ్డిలతో పాటు ఎ.లక్ష్మి (గురుకుల పాఠశాల), ఎల్.దివ్య (గురుకుల పాఠశాల), బి.శిరీష (గురుకుల పాఠశాల), ఎ.సలోని (కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాల)లకు ఈ ఏడాది ప్రభుత్వ ప్రతిభ పురస్కారాలు దక్కాయి. డాక్టర్ అబ్దుల్‌కలాం ప్రతిభ అవార్డుల పేరుతో ఆరుగురు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయనుంది.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం మద్దిరేవుల గ్రామంలోని శివమ్మ అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయంపై ఆచరణాత్మక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, ప్రతి రైతు ప్రకృతి పరమైన, మన చుట్టూ దొరికే వ్యవసాయ ఎరువులను పొలాలకు ఉపయోగించాలన్నారు. చెరువు మట్టి, ఆవు, బర్రెల పేడతో తయారు చేసిన ప్రకృతి ఎరువులను పొలాలకు ఉపయోగించాలన్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం వంటి ప్రక్రియలను పంటకు ఉపయోగించాలన్నారు. రాష్ట్ర సీనియర్ టిమాటిక్ లీడ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ మామిడిలో పంట కోసిన తర్వాత పనికిరాని కొమ్మలను తీసివేసి పొలాన్ని దుక్కులు చేసి చెట్టుకు ప్రకృతి ఎరువులను ఉపయోగిస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు.

రూ.26 లక్షలతో రైతుబజారు ఏర్పాటు

● రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : ఏడీ

పీలేరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పీలేరులో రూ.26 లక్షలతో రైతు బజారు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ త్యాగరాజు తెలిపారు. గురువారం ఆయన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు రైతుబజారు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజారును మార్కెట్ కమిటీ ఆవరణలో లేదా సీఎల్ఆర్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజారు ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పండించే పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్నీ రైతు బజారు ద్వారా అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో టమోటా మార్కెట్ పునఃప్రారంభించడానికి రైతులు, వ్యాపారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అన్నమయ్య జిల్లా పరిధిలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, అన్ని పనితీరు బేష్‌గా ఉందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామూర్తి, డైరెక్టర్లు రహంతుల్లా, వనిత, అనురాధ ఉన్నారు.

ఏడాది పాలనలో రూ.40 కోట్లతో అభివృద్ధి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో రూ.40కోట్లతో మదనపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మదనపల్లెను నాశనం చేశారని, దీన్ని బాగు చేసేందుకు నిత్యం కష్టపడుతున్నామన్నారు. నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, అధికారులతో సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తున్నామన్నారు. 22ఏ నిషేధిత భూములు కాజేయడం, ల్యాండ్, సాండ్, శాండిల్ మాఫియాతో ఐదేళ్ల పాటు రెచ్చిపోయిన వైసీపీ ఎమ్మెల్యేలు మంత్రులు ప్రతి రోజు ప్రజలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు సిగ్గుతో తలదించుకోవాలని విమర్శించారు. ఇసుకకు అధిక ధరలతో ప్రజలను దోపిడ చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక మదనపల్లెలో రూ.16వేలకే టిప్పర్ ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, మోడెం సిద్దప్ప, నీలకంఠ, బాలుస్వామి, నాగూర్‌వలి, నాదెళ్ల శివన్న, ఎస్ఎం రఫి, నవీన్, జంగాల రమణ, శశికుమార్, తలారి రాధ, పులి మహాలక్ష్మి, బైగారి భారతి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యంతో బక్రీద్ జరుపుకోవాలి : సబ్ కలెక్టర్



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, జూన్ 5: మదనపల్లె డివిజన్‌లో బక్రీద్ పండుగను మత సామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో హిందూ, ముస్లీం సభ్యులతో కూడిన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు ఖుర్బాని పబ్లిక్ స్థలాల్లో నిర్వహించకూడదని, వీటికి కేటాయించిన స్థలాల్లోనే నిర్వహించాలన్నారు. ఇళ్ల వద్ద ఖుర్బాని ఇచ్చే వారు వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా, పరిశుభ్రత పాటించాలన్నారు. పండుగ రోజు సామూహిక సమావేశాలు నిర్వహించినప్పుడు సున్నితమైన అంశాలను సోషల్ మీడియాలో పోస్టు చేయకూడదని, గతంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన వారిని గుర్తించి పోలీసులు బైండోవర్ చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా చీకిలబైలు, సర్కారుతోపు, ములకలచెరువు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో డీఎవో రాఘవేంద్ర, ఇన్‌చార్జి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సీఐలు ఎరిషావలి, జీవన్ గంగాధర్‌బాబు, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్ పల్లవి, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుండ్లూరు మూలస్థానమ్మ జాతర

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుండ్లూరు మూలస్థానమ్మ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. జాతర నిర్వహణపై వివాదాలు రేగిన సంగతి తెలిసిందే. అమ్మవారి జాతర నిర్వహణకు రెండు వర్గాలు పోటీపోటీగా వేర్వేరు తేదీలు ప్రకటించి వివాదం పోలీసు స్టేషను వరకూ చేరిన సంగతి కూడా విదితమే. ఎట్టకేలకు గతంలో జాతర నిర్వహించిన వారే తిరిగి ఈ ఏడాది నిర్వహించేందుకు అంగీకారానికి రావడంతో వివాదం ముగిసింది. దీంతో ముందుగా ప్రకటించినట్లు శనివారం సిద్దపూజ, జాగారంతోపాటు రాత్రి బయనేని వారిచే శ్రీమూలస్థానమ్మ హరికథను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం దివ్వెలు, బోణాలు, చాందినీ బండ్లు, చెక్క భజనలు, పిల్లనగ్రోవుల భజనలు జరుగనున్నాయి. సోమవారం రాత్రి పుష్పపల్లకి సేవ, అమ్మ వారి ఊరేగింపు ప్రత్యేకంగా నిలవనున్నాయి. ఇందుకనువుగా రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో ఆలయ పరిసరాలను దేదీప్యమానం చేయనున్నారు. వివిధ మండలాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు తరలిరానున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సన్నాహాలు కూడా మొదలు పెట్టారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

● యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన దొరబాబునాయుడు

సంబేపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల గ్రామం గంగన్నగారి ఇళ్ల సమీపంలో గురువారం స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒంటిమిట్ట దొరబాబునాయుడు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రౌతుకుంట గ్రామం పోతువాండ్లపల్లెకు చెందిన దొరబాబునాయుడు తమ బంధువుల పిల్లల బియ్యం కార్డు, ఆధార్, ఈకేవైసీ అప్డేట్ కొరకు శెట్టిపల్లి సచివాలయానికి వెళ్లారు. పని ముగించుకొని తమ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా శెట్టిపల్లి వైపు నుంచి వస్తున్న కారు గంగన్నగారి ఇళ్ల సమీపంలో స్కూటర్‌ను వెనుకవైపు ఢీకొనడంతో పిల్లలకు స్వల్పగాయాలు కాగా దొరబాబుకు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దొరబాబును మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

గంజాయితో జీవితం నాశనం

● బాలల సంరక్షణ జిల్లా అధికారి వినోద్‌కుమార్



అప్పయ్యరాజుపేటలో డ్రగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వినోద్‌కుమార్

పుల్లంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏది తప్పో ఏది ఒప్పో తెలియని వయస్సులో చిన్నారులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామంలో కేజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ఉపసర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అర్ధరాత్రి వేల యువకులు భయంకరమైన శబ్దాలతో బైకు రైడింగ్, గంజాయి స్మోకింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న వయస్సులో డ్రగ్స్‌కు అలవాటు పడి జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఇందువల్ల తల్లిదండ్రులకు కూడా చెడ్డపేరు వస్తుందని తెలిపారు. డ్రగ్స్ ద్వారా ఏమైనా సమస్యలు వస్తుంటే తమకు తెలియజేయాలని, లేనిపక్షంలో 1098 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎస్ఐ శివప్రసాద్, బాలల సంరక్షణ అధికారులు పీఓఐసీ రామలక్ష్మీ, బి.వెంకటకుమార్, సోషల్ వర్కర్ శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఇళ్లలో ఓ యువకుడు అనారోగ్య కారణంతో ఉరేసుకుని మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మూడేళ్ల క్రితం కొత్త ఇళ్లకు చెందిన హరిప్రసాద్(32)కు పుంగనూరు మండలం, చదళ్లకు చెందిన నాగవేణితో వివాహమైంది. ఏమైందో ఏమో తెలియదు కానీ వారం రోజుల క్రితం భార్యను వారి అమ్మగారి ఇంట్లో వదిలి వచ్చాడు. బుధవారం రాత్రి తన ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న భార్య తరపు బంధువులు కొత్త ఇళ్లకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా మృతుడికి రెండేళ్ల కుమారుడు ఉన్నట్లు తెలిసింది.

ప్రతిభా అవార్డులకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

మదనపల్లెటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డులకు మదనపల్లెకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ప్రకటించిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలోని విజయభారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రెడ్డి సుదీప్, మనోజ్ఞ ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని, వీరికి రూ.25 వేల చొప్పున నగదు బహుమతి అందనుందని ప్రిన్సిపాల్ ఎన్.సేతు తెలిపారు.

ఆడ బిడ్డలకు ఆలంబనగా..

- ప్రభుత్వ బాలికాసదన్
- అమ్మ లేని లోటు తీరుస్తున్న సిబ్బంది

అభం శుభం తెలియని వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు.. తల్లీ తండ్రి ఉన్నా ఆదరణ కరువైన బాలికలకు స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్వహిస్తున్న బాలికాసదన్ తోడు నీడగా నిలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పిల్లలను తమ పిల్లలే అన్న భావనతో సేవలందిస్తూ వారిలో ప్రేమానురాగాలు నింపుతున్నారు. దీంతో పిల్లలు కూడా సిబ్బందిని అమ్మ అని పిలుస్తూ ఆప్యాయత పంచుతున్నారు.



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లి తండ్రి లేని అనాథలను, నిరాదరణకు గురైన బాలికలను నేరుగా వారి బంధువులు, గ్రామ పెద్దలు బాలికాసదన్‌లో చేరుస్తారు. అదే విధంగా ఎక్కడైనా అను మానాస్పదంగా తిరుగుతున్న పిల్లలను బాలల సంరక్షణ సంస్థ వారు గుర్తించి అక్కడ చేర్పించడం జరుగుతుంది. 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న పిల్లలు ఇక్కడ చేరవచ్చు. వీరిని సమీపంలోని పాఠశా లల్లో చేర్పించి చదివిస్తారు. 5వ తరగతి పూర్తి చేసిన అమ్మాయిలను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చేర్పిస్తారు. అక్కడ చేరిన పిల్లలకు వసతి సౌకర్యం అక్కడే ఉంటుంది. అయితే పాఠశాలలు కళాశాలల్లో చదివే పిల్లలకు వేసవి పండుగ సెలవులు వచ్చినప్పుడు వారిని తిరిగి బాల సదనానికే తీసుకువస్తారు. వారు విద్య పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడేంత వరకు స్త్రీ శిశు సంక్షేమశాఖ సదన్‌లోనే ఉంటారు.

18 ఏళ్లు నిండిన తరువాత

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలిక సదన్‌లోనే 18 సంవత్సరాల వయసు వచ్చే వరకు ఆశ్రయం పొందవచ్చు. కానీ ఒక అమ్మాయి డిగ్రీ రెండు సంవత్సరాలు పూర్తి అయింది. ఇక ఒక సంవత్సరమే ఉండడంతో ఉన్నతాధికారుల అనుమతితో కడప నగరంలోని బాలిక సదన్‌లో ఆశ్రయం కల్పించి విద్యనభ్యసించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పుట్టినరోజులు, పెళ్లి రోజు వేడుకలతో కొంత మంది స్వచ్ఛందంగా ఇక్కడున్న బాలికలకు అన్నదానం, కానుకలు ఇచ్చే సంప్రదాయానికి అధికారులు స్వస్తి పలికారు. కొన్ని సందర్భాల్లో దాతలు తమ పిల్లల పుట్టిన రోజు వేడుకల్లో నానా హంగామా సృష్టిస్తుంటారు. ఆ సమయంలో తమకు కూడా తల్లిదం డ్రులు ఉంటే ఇలాగే వేడుకలు చేసేవారేమో అనే భావన ఆ పిల్లల్లో కలగకుండా ఉండేందుకు తాము ఈవిధానం ప్రోత్సహించడం లేదని స్థానిక సిబ్బంది చెబుతున్నారు.



ఆదుకోవడం మా బాధ్యత

అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించి ఆదుకోవడం మా బాధ్యత. వారికి అమ్మనాన్న లేని లోటు తీరుస్తున్నాం. 18 మంది పిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ప్రాథమిక విద్య అయిపోయిన తరువాత వేరే పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలికలను వేసవి సెలవులకు ఇక్కడికే తీసుకువస్తాం.

వి.శారదదేవి, సూపరింటెండెంట్, బాలికాసదన్, కడప

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది... రాణి (పేరు మార్చాం)

మాది రాజంపేట వద్ద ఒక గ్రామం. నా ఏడవ ఏట మా నాన్న చనిపోయారు. ఆ తరువాత రెండు నెలలకే మా అమ్మ కూడా చనిపోయింది. మేం నలుగురు అక్కాచెల్లెళ్లం. మాకు ఎవరూ ఆశ్రయం కల్పించకపోవడంతో కడపలోని బాలికాసదన్‌కు చేరుకున్నాం. ప్రస్తుతం నేను 8వ తరగతి చదువుతున్నాను. నా సోదరీమణుల్లో ఇద్దరు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతన్నారు. మరో క సోదరి ఐదో తరగతి పూర్తయింది. పాఠశాలలు తెరవగానే ఆరవ తరగతిలో చేర్పించాల్సి ఉంది. బాగా చదవి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

పీజీ వరకు చదవాలని ఉంది.. మంజుల

నాకు ఐదేళ్ల వయసులో అమ్మ, నాన్న చనిపోయారు. దీంతో నేను, నా సోద రుడు అనాథలయ్యాం. కొంత మంది మమ్మల్ని డాడీ హోంలో చేర్పించారు. మా తమ్ముడు విజయవాడలోని ఓ హోంలో ఉన్నాడు. 1వ తరగతి నుంచి 9 వరకు డాడీ హోంలో విద్యను అభ్య సించాను. దత్తత కార్యక్రమం కింద గుంటూరు జిల్లా వారు నన్ను దత్తత తీసుకున్నారు. కానీ వారు బాగా చూసు కోకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాను. దీంతో నన్ను కడపలోని బాలికా సదన్‌కు తీసకువచ్చారు. కడప నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాను. భవిష్యత్తులో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలనేది నాకోరిక.

అనంతపురం, చిత్తూరు జట్ల విజయం





లోహిత్ లక్ష్మీనారాయణ (112 పరుగులు), మహేంద్ర (67 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-23 పురు షుల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా గురు వారం అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి 38.1 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో నయీముల్లా 59 పరుగులు, ఖానిష్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టు కేవలం 34.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసి విజయభేరి మోగిం చింది. ఇందులో మహేంద్రరెడ్డి 67, అర్జున్ టెండూల్కర్ 40 పరుగులు చేశారు. అలాగే ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 296 భారీ స్కోరు సాధించింది. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 112 పరుగులు సాధించడం విశేషం. అనంతరం బరిలో దిగిన నెల్లూరు జట్టు 42.2 ఓవర్లలో 202 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో మన్విత్‌రెడ్డి (52) పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 94 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7.92 కోట్లు మంజూరు

దువ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కలెక్టర్ ద్వారా రూ.7.92 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దువ్వూరు మండలానికి రూ.1.66 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పలు గ్రామాల్లో 20 చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించనున్నారు. అదే విధంగా బి.మఠం మండలానికి 21 పనులకు రూ.1.57 కోట్లు, చాపాడు మండలానికి 38 పనులకు రూ.1.29 కోట్లు, ఖాజీపేట మండలానికి 35 పనులకు రూ.1.96 కోట్లు, మైదుకూరు ప్రాంతానికి 25 పనులకు రూ.1.47 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి అయిదు మండలాలకు రూ.7.92 కోట్లు నిధులు కేటాయించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని డీఎస్పీ భావన పేర్కొన్నారు. గ్రంథాలయాల ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగిన సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వాట్సాప్ ద్వారా డీఎస్పీ భావన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. గ్రంథాలయాల ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు మునిశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, డీకే చదువులబాబు, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ- స్కూటరు ఢీ.. వీఆర్వో మృతి



ఈశ్వరయ్య (ఫైల్‌ఫొటో)

కమలాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో గురు వారం జరిగిన ప్రమాదంలో పొలతల ఈశ్వ రయ్య (59) మృతి చెందారు. మండలంలోని పాచికలపాడు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కమలాపురం 1వ సచివాలయంలో వీఆర్వోగా, చదిపిరాళ్ల సచివాలయంలో ఇన్‌చార్జ్ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన కమలాపురం వైపునకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెనక భాగాన లారీ ఢీకొంది. దీంతో ఈశ్వరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న డీలరు నాని స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు ఈశ్వరయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, రాణికుమారి మృతదేహం

సీకేదిన్నె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామానికి చెందిన చరసాల రాణికుమారి (52) సరస్వతిపల్లెలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. గురువారం ఆమె స్వగ్రామానికి వెళ్లి ప్రస్తుతం నివశిస్తున్న కడప నగరం రాఘవేంద్ర టౌన్‌షిప్ వద్దకు వస్తుండగా బుగ్గలేటిపల్లె సమీపంలో ప్రమాదం జరిగింది. రాణికుమారి ప్రయాణిస్తున్న కారును గుర్తు తెలియని వాహనం వెనుకవైపు స్వల్పంగా ఢీకొనడంతో కారు రివర్స్ తిరిగింది. దీంతో వెనుక వస్తున్న అన్నమయ్య జిల్లా డిప్యూటీ డెమో ఆఫీసర్ దేవశిరోమణి ప్రయాణిస్తున్న కారు రాణికుమారి కారును ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. దేవశిరోమణి కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఉపాధ్యాయురాలు రాణికుమారికి భర్త సోమా పుల్లయ్య , ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిసింది. ఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

లింగాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గవిరెడ్డి శివారెడ్డి(60) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకెళితే... శివారెడ్డికి అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడం, గతంలో ఆయన భార్య ప్రమాదంలో మరణించడం, కుమారుడు విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ప్రస్తుతం శివారెడ్డి తల్లి గంగమ్మ(80)తో కలిసి నివాసం ఉంటున్నారు. తల్లి గంగమ్మ నడవలేని స్థితిలో ఉంది. తల్లి సంరక్షణ చూసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల శివారెడ్డికి ఆరోగ్య సమస్యలు తీవ్రం కావ డంతో మనస్థాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

లారీ నిలిపి దోపిడీ... కేసు నమోదు

ముద్దనూరు జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప, తాడిపత్రి హైవే రోడ్డులోని చౌటిపల్లె గ్రామ సమీపం వద్ద జరిగిన దుండగులు లారీ నిలిపి దోపిడీకి సంబంధించి గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల సమాచారం మేరకు తాడిపత్రి మండలం గోసువారిపల్లెకు చెందిన లారీ డ్రైవర్ గంగరాజు లారీతో మే31 వ తేదీ రాత్రి ముద్దనూరు వైపు వస్తున్నాడు.చౌటిపల్లె గ్రామం వద్దకు రాగానే నల్ల స్కార్పియోలో దాదాపు 8 మంది దుండగులు వచ్చి లారీకి అడ్డంగా పెట్టి నిలిపి డ్రైవర్ ను కొట్టి రూ.2వేలు నగదు దొచికొని, మొబైల్‌ను పగలగొట్టారు.డ్రైవర్ అదే రోజు రాత్రి ఫిర్యాదు చేసి, ఆసుపత్రికి వెళ్లాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.దీనికి సంబందించి స్కార్పియో, ఓనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. గురువారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి ఏపీ హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్ఎస్‌సీ సెలక్షన్ పోస్టులు, ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ, ఎన్‌టీపీసీ ఉద్యోగాలకు 10వ తేదీ నుంచి సబ్జెక్టు నిపుణులతో శిక్షణ ఇస్తామని తెలిపారు.

అల్ట్రాటెక్ వద్ద కాంట్రాక్టు కార్మికుల ధర్నా

● సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ ● యాజమాన్యంతో చర్చలు విఫలం





ర్యాలీగా వస్తున్న కార్మికులు, గేటు మూసివేసిన సెక్యూరిటీ సిబ్బంది

ఎర్రగుంట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం వద్ద కాంట్రాక్టు కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు గత నెల రోజులుగా విధులు బహిష్కరించారు. కలెక్టర్‌కు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. అయితే ఇప్పటి వరకు డిమాండ్లు పరిష్కరించకపోవడంతో సాయంత్రం మెయిన్‌గేటు వద్ద కార్మికులు బైటాయించారు. కార్మిక సంఘం నాయకులు జంగం రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శేఖర్ తదితరులు ప్లాంట్ వీపీ మారిముత్తు, హెచ్ఆర్ అధికారి థామస్‌తో చర్చలు జరిపారు. అయితే సమస్యల పరిష్కారంలో సయోధ్య కుదరకపోవడంతో వారు ధర్నా కొనసాగిస్తున్నారు. విద్య, వైద్య సదుపాయలు కల్పిండం లేదని, గ్రామాల చుట్టూ కాలుష్యం వ్యాపించడం వల్ల క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు సీఎస్ఆర్ నిధులు కేటాయించడం లేదన్నారు. కార్మికులకు ఇప్పటి వరకు గ్రేడ్లు, ఇంక్రిమెంట్లు మార్పు చేయ లేదన్నారు. కరోనా సమయంలో తొలగించిన సుమారు 100 మంది కార్మికులను తిరిగి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా, కార్మికుల ధర్నాపై సీఐ నరేష్‌బాబు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఇబ్బందుల్లేకుండా ఆందోళన చేసుకోవాలని తాము ఆదేశించినట్లు తెలిపారు. కొంతమంది నాయకులు యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ధర్నా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, దుంగలతో పోలీసులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. బ్రహ్మంగారిమఠం వయా మైదుకూరు మిట్టమానుపల్లె అటవిప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను దాచి ఉంచి రవాణా చేసేందుకు సిద్దంగా ఉంచారని, విషయం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అక్కడ ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర ప్రమాణ స్వీకారం

మైదుకూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం స్థానిక కడప రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతున్నారని తెలిపారు.

అధిక దిగుబడుల కోసం శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

రాజుపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవాలని కేవీకే అధిపతి బాలకృష్ణ తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని రాజుపాలెం, చిన్నశెట్టిపల్లె, టంగుటూరు, అయ్యవారిపల్లె, వెంగలాయపల్లె, తొండలదిన్నె, ఏరువపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ తరపున వచ్చిన సుబ్బరాయుడు, శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ జొన్న, మొక్కజొన్న, కొర్రల్లో మేలైన రకాలు, వాటి యాజమాన్య పద్ధతులపై వివరించారు. డాక్టర్ భగవత్ వరి, పత్తి, మినుము రకాల్లో సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగంపై, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ పృధ్వీధర్‌రెడ్డి పశువులలో అధిక పాల ఉత్పత్తి, పోష ణ, వ్యాధినిరోధక టీకాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల వద్ద మొక్కలు నాటారు.

దుంపలగట్టులో వ్యక్తి ఆత్మహత్య

● పోలీసులే కారణమంటూ భార్య ఆరోపణ

ఖాజీపేట/ కడప క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే తన భర్త మృతికి పోలీసులే కారణమంటూ మృతుడి భార్య ఆరోపిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. దుంపలగట్టుకు చెందిన రెడ్యం శివలక్ష్మీనారాయణ రెడ్డి (40) గంజాయి కేసులో నిందితుడు. ఈ మేరకు ఇతనికి కోర్టు 50 రోజులు శిక్ష విధించింది. శిక్ష అనంతరం ఇటీవల బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక పుష్పగిరికి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని ఇతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఇతను తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతూ వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అప్పటికే చనిపోయాడు. ఈ మేరకు పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో వారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. గురువారం రిమ్స్ వద్ద మృతుడి భార్య రెడ్యం సుభాషిణి మాట్లాడుతూ.. తన భర్త ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమని పేర్కొన్నారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెడ్యం శివలక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు బాధితుల ఫిర్యాదు మేరకు ఖాజీపేట హెడ్ కానిస్టేబుల్ సుబ్బయ్య కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ బాధ్యతలను మైదుకూరు సీఐ రమణకు అప్పగించినట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. కాగా, ఖాజీపేట పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడంతోనే లక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వైసీపీ నేతలు ఆరోపించారు. అయన ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం ఎస్పీ బంగ్లాలో వైసీపీ జిల్లా అధ్య క్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలు కలిశారు.





ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతదేహం, నారాయణరెడ్డి (ఫైల్)

బక్రీద్‌ను ఐకమత్యంగా నిర్వహించుకోండి

రైల్వేకోడూరు రూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంగా బక్రీద్‌ను నిర్వహించుకోవాలని రైల్వేకోడూరు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఈ నెల 7న నిర్వహిస్తున్నారన్నారు. గోవులను వధించరాదన్నారు. ముస్లిం మత పెద్దలు మస్తాన్, ముజీబ్, పఠాన్ మౌలా, ఖాదర్ బాషా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ

నందలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హిందూ ముస్లిం సోదరులు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ బీవీ రమణ సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, హిందూ ముస్లిం సోదరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్దలతో ఎస్‌ఐ సమావేశం

ఓబులవారిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముస్లిం పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసిన ఎస్‌ఐ మహేష్ బక్రీద్ పర్వదినం సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు అభ్యంతరాలు లేకుండా పండుగ నిర్వహించుకోవాలని మత పెద్దలకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోండి

లక్కిరెడ్డిపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కించపర్చకుండా ఎలాంటి గోహత్యలు చేయకుండా ప్రశాంతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హిందూ, ముస్లిం పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ఉషారాణి, ఎస్‌ఐ రవీంద్ర, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

డ్వాక్రా భవన నిర్మాణానికి కృషి

సిద్దవటం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటంలో డ్వాక్రా భవన నిర్మాణానికి కృషి చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం పాత డ్వాక్రా భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా భవనం పూర్తిగా దెబ్బతినిందని, నిర్మాణ పనులు చేపట్టేందుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వాన్ని చాటుతున్న పారిశ్రామికవేత్త


యంత్రాన్ని అందిస్తున్న కౌలూరి రమణారెడ్డి

ఓబులవారిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ముక్కావారిపల్లె ప్రాథమిక వైద్య కేంద్రానికి మంగంపేటకు చెందిన పారిశ్రామికవేత్త కౌలూరి రమణారెడ్డి బేబీ వార్మర్‌ను విరాళంగా అందించినట్లు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ యంత్రాన్ని సుమారు రూ.50 వేలతో కొనుగోలు చేసి అందించారని ఆయన తెలిపారు.

యోగాంధ్రాకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన మెగా యోగాంధ్ర దినం సందర్భంగా ప్రతి ఒక్కరూ స్థానిక జెడ్పీహెచ్ హైస్కూల్‌లో హాజరుకావాలని ఎంపీడీవో ఉషారాణి పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలందరు కూడా హాజరై యోగాసనాలు చేసుకోవాలన్నారు. యోగా వల్ల ఎంతో ఆరోగ్యంగా, ప్రశాంతత ఉంటారన్నారు.

నారాయణనెల్లూరులో యోగాంధ్ర

పెనగలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణనెల్లూరు గ్రామంలో డాక్టర్ కళాచంద్ర అధ్యక్షతన గ్రామ ప్రజలతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళాచంద్ర మాట్లాడుతూ ప్రజలు నిత్యం యోగాసనాలు చేస్తే ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

● చెట్ల ద్వారానే జీవకోటికి ప్రాణవాయువు ● మొక్కలు నాటుదాం వాటిని సంరక్షిద్దాం ● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


చిన్నమండెం: సచివాలయంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామచంద్ర


రాయచోటి: మొక్కను అందజేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి


పెనగలూరు: ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

సంబేపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, యువగళం సభ్యులు మండిపల్లి సిద్దారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, సంబేపల్లె సర్పంచ్ రామచంద్ర తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం వద్ద మోడల్ పాఠశాలలో మొక్కలు నాటారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

నందలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ఎంపీడీవో రాధాకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లెలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయం-2 కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

నందలూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కన్యకచెరువు సమీపంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకుడు డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు, ఎస్‌ఐ రామ్మోహన్, కుర్రా మణియాదవ్, మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిక్షణ మనందరి బాధ్యత

రాయచోటిటౌన్, జూన్5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గొర్లముదివేడు పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలో ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, మాజీ సర్పంచ్‌లు జిలానీ బాషా పాల్గొన్నారు. కాగా వెరు దు వృత్తిదారుల సంక్షేమ, అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి గజపనేని రెడ్డెయ్య ఆధ్వర్యంలో వెదురు టూత్ బ్రష్‌లను ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులకు ఉచితంగా పంపిణీ చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రామాపురం, జూన్5(ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఉపాధి హామీ ఏపీవో పెంచలయ్య పేర్కొన్నారు. రాచపల్లి పంచాయతీలోని ఎంపీయూపీ స్కూల్ ఆవరణంలో వంగిమళ్ల ఫారెస్టు సెక్షన్ అధికారి భరణికుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులతో కలిసి మొక్కలు నాటించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెనగలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ మొక్కలను నాటి బాధ్యతగా పెంచాలని పెనగలూరు ఎంపీడీవో విజయరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రాజేశ్వరి, విజయకుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలు, పొలాల గట్లపై మొక్కలు నాటారు.

ప్రాణవాయువును అందించే మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

రైల్వేకోడూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రాణవాయువును అందించే మొక్కల సంరక్షణ మన అందరి బాధ్యత అని ఐసీడీఎస్ ఏసీపీడీవో సరళాదేవి తెలిపారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రమిట్ట గ్రామంలో మొక్కలు నాటారు. చెట్ల ద్వారా మంచి గాలి అందుతుందన్నారు. సూపర్‌వైజర్ కే.యశోధ, అంగన్వాడీ కార్యకర్త కే. ప్రసన్న పాల్గొన్నారు.

మొక్కల పెంపకం తప్పనిసరి

సుండుపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకం మనందరి బాధ్యత అని ఎంపీపీ రాజమ్మ, విద్యుత్‌శాఖ మండల అధికారి రమేశ్‌బాబు అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ రాజమ్మ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏఈ రమేశ్‌బాబులు మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేశ్‌బాబు, ఎఫ్‌బీవో అంజనస్వామి, అటవీశాఖ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సుండుపల్లె: మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాజమ్మ, అటవీశాఖ అధికారులు

ఇంటింటా మొక్క.. ఊరంతా వనం

లక్కిరెడ్డిపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): ఇంటింటా మొక్కలు పెంచితే ఊరంతా వనం అవుతుందని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని ఎంపీడీవో ఉషారాణి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గాలివీడు, జూన్5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మొక్కలు పెంచాలని తెలిపారు.

సచివాలంయలో మొక్కలు నాటిన ఎంపీడీవో

చిన్నమండెం, జూన్5(ఆంధ్రజ్యోతి): దేవగుడిపల్లి సచివాలయంలో ఎంపీడీవో రామచంద్ర మొక్కలు నాటారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

ఘనంగా ఓంకార గంగమ్మతల్లి జాతర


గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసూరివారిపల్లెలో గురువారం ఓంకార గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలు గంగమ్మతల్లికి మొ క్కులు తీర్చుకున్నారు. మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ కన్వీనర్లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, కూటమి నాయకులు పగడాల వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న చమర్తి

ఓబులవారిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చలంపాలెం గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా రాజంపేట నియోజకవర్గ, పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారపురెడ్డిపల్లె దళితవాడలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. రైల్వేకోడూరు టీడీపీ నాయకురాలు, కుడా చైర్మన్ సతీమణి ముక్కా వరలక్ష్మి హాజరై పూజలు చేశారు. టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, లేబాక రెడ్డయ్యరెడ్డి, ఊటుకూరు పాలిరెడ్డి, బొడ్డు రామక్రిష్ణ పాల్గొన్నారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

సిద్దవటం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మాధవరం-1, ఎస్‌కేఆర్‌నగర్ గ్రామంలో వెలసిన అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. ఈ తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమం శుక్ర, శని, ఆదివారాల్లో జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

చిట్వేలిలో ఎన్టీఆర్ సేవా ట్రస్టు ప్రారంభం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న నాయకులు

చిట్వేలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలిలో గురువారం ఎన్టీఆర్ సేవా ట్రస్టును ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్‌గా కె.నాగార్జున, సభ్యులుగా బి.రెడ్డయ్య, కోటేశ్వర్‌రావు, పి.దినేష్, బి.నకుల్, టి.వెంకట మధు ఎంపి కయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్ కేకే చౌదరి, పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, మాజీ ఎంపీపీ కట్టా గుం డయ్య పాల్గొన్నారు. అనంతరం కొత్తబస్టాండు వద్ద ఎన్టీఆర్ సేవాట్రస్టు ఆధ్వర్యంలో రెండు వాటర్ ప్లాంట్స్, 2 బాడీ ఫ్రీజర్‌లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు తిరుపతివారి ఆధ్వర్యంలో కొత్తబస్టాండులో 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీనియర్ నాయకులు కాకర్ల లారీ సుబ్బరాయుడు, బాలురామాంజేయులు, బాలాజీ, వెంకటయ్య, చంద్రమోహన్, శంకరయ్యయాదవ్, గుండయ్య యాదవ్, సుధీర్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్‌రాజు, కట్టా లోకేష్, సింగన హరి, తిరుమలరెడ్డి, స్థానిక నాయకులు చౌడవరం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని నెహ్రూనగర్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఆటో-జీపు ఢీకొనడంతో ఆంజనేయులు, జీపు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... ఆంజనేయులును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరిణమ్మ తిరునాళ్లు ప్రారంభం

సుండుపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ జంగంపల్లిలో గురువారం నుంచి మరిణమ్మ తిరునాళ్లు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ సమ్మెట నాగార్జున తెలిపారు. మొదటిరోజు ప్రత్యేక పూజలు, అభిషేకం, పోతులరాజు ఊరేగింపు జరిగింది. అనంతరం ఆసాది కథ నిర్వహించారు. 6వ తేదీ అమ్మవారి చల్ల కార్యక్రమం, అన్నదానం, రాత్రికి ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. 7వ తేదీ కుంకుమార్చన, అభిషేకం, తీర్థప్రసాద వినియోగంతో పాటు అదేరోజు రాత్రి చాందినీ బండ్లు దర్శనం ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రి నారాయణను కలిసిన నాగోతు


మంత్రి నారాయణకు వినతి పత్రం అందజేసిన రమేశ్ నాయుడు

రాజంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట మున్సిపాలిటి పరిధి పెంచాలని అపరిష్కృతంగా ఉన్న సమస్యలపైన దృష్టి పెట్టి చుట్టూ ఉన్న గ్రామాలను ప్రజాభిప్రాయం మేరకు విలీనం చేయాలని గురువారం అసెంబ్లీ ఆవరణంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, మంత్రి నారాయణను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అభివృద్ధి పడక వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదకవితా పితామహుడు అన్నమయ్య పుట్టిన ప్రాంతం కావున పట్టణంలో ఆధ్యాత్మికశోభ కనపడేలా అభివృద్ధి చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలి : ఆర్డీవో


యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో

సిద్దవటం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. గురువారం సిద్దవటంలో పురావస్తుశాఖ కోట, పార్కు ప్రదేశంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు కేవలం 30 నిముషాలు యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక శాంతి సిద్ధిస్తాయని, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. జిల్లా యోగా స్పెషల్ ఆఫీసర్ సురేష్‌బాబు మాట్లాడుతూ యోగా కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహిస్తే మేలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జయసింహ, తహసీల్దారు ఆకుల తిరుమలబాబు, మండల అభివృద్ధి అధికారి పణిరాజకుమారి, డీటీ మాధవిలత, ఆయుష్ వైద్యులు మురళీబాబు, ఎస్‌ఎండీ హమీద్, అల్లోపతి వైద్యులు డాక్టర్ ప్రకాష్, రంగలక్ష్మీ, పంచాయతిరాజ్ ఏఈ నాగరాజు, ఎస్‌ఐ మహ్మద్‌రఫీ, మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్, ఉపాధి హామీ ఏపీవో నరసింహులు, పంచాయతీ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోతాపూరి మామిడి ధర పెంపుపై కలెక్టర్ సానుకూల స్పందన


కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు, వ్యాపారులు

రైల్వేకోడూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కోడూరు తోతాపూరి మామిడి ధర పెంపుపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ సానుకూలంగా స్పందించినట్లు రైల్వేకోడూరు మ్యాంగో మార్కెట్ యార్డు అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మిశెట్టిపల్లె మణి, కార్యదర్శి మున్వర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శితో చర్చించి ఈనెల 9న తోతాపూరి మామిడిపై స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తామని తెలపారన్నారు. కోడూరు తోతాపూరి మామిడికి చిత్తూరులో ఉన్న ధరను నిర్ణయించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. తద్వారా కోడూరు తోతాపూరి మామిడి జ్యూస్‌కు కిలో రూ.12 చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామాపురం, జూన్5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాహవా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల, మండలస్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు తప్పక హాజరుకావాలన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూన్5(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9 తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. 6వ తరగతిలో గతంలో ఆన్‌లైన్ చేసుకుని సీటు పొందిన వారు పాఠశాలలో చేరవచ్చునని, అలాగే మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తులు పాఠశాలలో అప్పగించాలన్నారు. ఈ నెల 24వ తేదీన స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆన్‌లైన్ చేసుకున్న వారు పరీక్షకు హాజరుకావాలన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

చిన్నమండెం, జూన్5(ఆంధ్రజ్యోతి): అన్నదానం పుణ్యకార్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకుడు నిశ్చల్‌నాగిరెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెం మండలం కొత్తపల్లి కస్పాలో జరిగిన మహాభారతం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అన్నం వడ్డించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు తహసీల్దార్ కృషి అభినందనీయం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు తహసీల్దార్ మహబుబ్ చాంద్ కృషి అభినందనీయం అని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడూరు మండలంలోని చియ్యవరం గ్రామంలో గత 25 సంవత్సరాలుగా పరిష్కరం కాని దారి సమస్యను శాంతియుతంగా పరిష్కరించారని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం దొరకని దారి సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో చర్చల ద్వారా పరిష్కారం చూపడంలో తహసీల్దార్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

దుర్యోధనుడి వధతో ముగిసిన మహాభారతం


దుర్యోధనుడి వధలోని ఓ ఘట్టం

చిన్నమండెం,జూన్5(ఆంధ్రజ్యోతి): దుర్యోధన వధతో మహాభారత యజ్ఞం ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. చిన్నమండెం మండలంలోని మల్లూరమ్మ గుడి వద్ద జరుగుతున్న 12వ పంచవేద మహాభారత యజ్ఞం గురువారం దుర్యోధని హరికథతో ముగిసింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జనం రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ మహోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: కలెక్టర్



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

పుల్లంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమంగా సక్రమంగా చేపట్టాలని, ఏ మాత్రం తేడా వచ్చినా చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని రెడ్డిపల్లెలోని చౌకదుకాణం-8ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఏయే సమయాల్లో సరకులు ఇస్తున్నారు ? ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారని ప్రశ్నించారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు ఎంతమంది ఉన్నారని తహసీల్దారు అరవింద కిశోర్‌ను ప్రశ్నించారు. అనంతరం అనంతంపల్లె గ్రామంలో ఉన్న 65 ఏళ్ల పైబడిన బి.వెంకటసుబ్బమ్మ ఇంటికి వెళ్లి కలెక్టర్ స్వయంగా సరుకులు పంపిణీ చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి



మొక్కలు నాటుతున్న డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి

సిద్దవటం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దవటం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో జనాభా పెరగడం వల్ల ఉన్న చెట్లను కూడా తొలగించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించారని, పర్యావరణం పెంచేందుకు ప్రతిఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పెంపకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ హరిప్రసాద్, మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి, ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

గీతలు... నియమాల సూచికలు !

- ట్రాఫిక్ నిబంధనలు సూచించే రోడ్డు మీద లైన్లు
- వాటి గురించి తెలుసుకోవాలంటున్న నిపుణులు



పీలేరు-కడప మార్గంలో కోటిగారిపల్లె వద్ద ఉన్న జీబ్రా క్రాసింగ్

పీలేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు బాగా పెరిగాయి. మితిమీరిన వేగంతో పాటు ఓవర్‌టేక్ చేసే సమయంలో వాహనాలు అదుపు తప్పడం పరిపాటిగా మారింది. డ్రైవర్ల అతి ఆత్మవిశ్వాసం, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్న వ్యక్తిగత క్రమశిక్షణ లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనరంగ నిపుణులు, పోలీసుల అభిప్రాయం. పరిసరాలను క్షుణ్ణంగా గమనిస్తే మనం ప్రయాణించే రోడ్డే మనకు ట్రాఫిక్ నియమాలు చెబుతుందని మోటారు వాహనాల తనిఖీ అధికారులు, వాహనరంగ నిపుణులు చెబుతున్నారు. మనం నిత్యం ప్రయాణించే రోడ్లపైనే ఉండే తెల్లని గీతలు ఆయా రోడ్లలో పాటించాల్సిన నియమాలు చెబుతాయని, వాటి గురించి కనీస అవగాహన చేసుకుని, కాసింత సంయమనంతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని వారి సూచన. వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఎంత ముఖ్యమో రోడ్ల మీద ఉండే గీతల గురించి అవగాహన కూడా అంతే ముఖ్యమని వారు చెబుతున్నారు. సాధారణంగా రోడ్డు మీద కనిపించే తెల్లని గీతలు రోడ్డును రెండు భాగాలుగా విభజించడానికి ఉన్నాయని చాలా మంది భావిస్తారని, అయితే ఆ గీతల వల్ల మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

జీబ్రా క్రాసింగ్

పాదచారులు రోడ్డు దాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి వీటిని ఏర్పాటు చేస్తుంటారు. పట్టణాల్లో గానీ, మారుమూల ప్రాంతాల్లో గానీ రహదారులపై జీబ్రా క్రాసింగ్స్‌ను గమనించినప్పుడు వాహనాలను విధిగా నెమ్మదిగా నడపాలని అర్థం. జీబ్రా క్రాసింగ్స్ వద్ద పాదచారులు రోడ్డు దాటే అవకాశం ఉంటుంది గనుక వాహనదారులు తమ వాహనాలను ఆ ప్రాంతాల్లో కాసింత నెమ్మదిగా నడపాలని ఇవి సూచిస్తాయి. వీటితో పాటు జాతీయ రహదారుల్లో మనకు కనిపించే మరిన్ని లైన్ల గురించి తెలుసుకుని వాహనం నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

డబుల్ అన్‌బ్రోకెన్ లైన్స్



వీటిని ఎక్కువగా ఘాట్ రోడ్లలో వేస్తుంటారు. డబుల్ అన్‌బ్రోకెన్ వైట్ లైన్స్ లేదా ఎల్లో లైన్స్‌గా వీటిని పిలుస్తారు. ఇవి ఉన్న చోట వాహనాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఓవర్‌టేక్ చేయకూడదు.

ఎల్లో స్పీడ్ బంప్స్



బోడుమల్లువారిపల్లె వద్ద ఉన్న స్పీడ్ బంప్స్

గతంలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు వేస్తుండిన ఎత్తైన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో ప్రస్తుతం ఎల్లో స్పీడ్ బంప్స్‌ను వాడుతున్నారు. రోడ్ల నాణ్యత, వాహనాల సామర్థ్యం, వాహనదారుల్లో అవగాహన బాగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి స్వస్తి పలికి వాటి స్థానంలో స్పీడ్ బంప్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మలుపులు, ఘాట్ రోడ్డు, లోతైన ప్రాంతం సమీపిస్తున్నప్పుడు వీటిని ఎక్కువగా వేస్తుంటారు. కేవలం మీటర్ల దూరంలో వీటిని మూడు, నాలుగు స్థానాల్లో వేస్తుంటారు. ఇవి కనిపించినప్పుడు వాహన వేగం తగ్గించాలని, వీలైనంత నెమ్మదిగా వెళ్లాలని స్పీడ్ బంప్స్ సూచిస్తాయి.

రోడ్డుపై ఉండే గీతల గురించి తెలుసుకోవాలి

- విజయకుమారి, ఎంవీఐ, పీలేరు



వాహనదారులకు లైసెన్స్ ఎంత ముఖ్యమో రోడ్డు నిబంధనలు సూచించే గీతల గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. లైసెన్స్ పొందిన తరువాత తమకు అంతా తెలుసునన్న భావనతో చాలా మంది తమ వాహనాలతో రోడ్డుపైకి వచ్చేస్తుంటారు. లక్షలు ఖరీదు చేసే వాహనం తమ చేతుల్లో ఉందన్న ఆత్మవిశ్వాసంతో ట్రాఫిక్ నిబంధనల గురించి పెద్దగా ఆలోచించరు. వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉండే రహదారుల గురించి వాహనదారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో రోడ్ల మీద వివిధ ఆకారాలు, రంగుల్లో లైన్లు ఏర్పాటు చేస్తారు. వాటిని సూచించే నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

బ్రోకెన్ వైట్ లైన్స్

జిల్లాలోని అత్యధిక రోడ్లలో అత్యధిక భాగం బ్రోకెన్ వైట్ లైన్స్ మనకు కనిపిస్తాయి. వీటిని రోడ్డును రెండు భాగాలుగా విభజించడానికి వేశారని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అయితే వాటి అర్థం కేవలం రోడ్డు విభజన మాత్రమే కాదని, వాహన దారులకు ఆ రోడ్డు గురించి ఆ లైన్లు తెలియ జేస్తాయని నిపుణులు చెబుతున్నారు. బ్రోకెన్ వైల్ లైన్సు ఉన్న చోటు మాత్రమే తమ పక్కనున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయవచ్చునని, ట్రాఫిక్ లేని సమయంలో యూటర్న్ కూడా తీసుకోవచ్చని సూచిస్తాయి.



పీలేరు-మదనపల్లె మార్గంలో బ్రోకెన్ వైట్ లైన్స్



పీలేరు-చిత్తూరు మార్గంలో అన్‌బ్రోకెన్ వైట్ లైన్

అన్‌బ్రోకెన్ వైట్ లైన్స్

వీటిని ఎక్కువగా మలుపుల్లో చూస్తుంటాం. మనం ప్రయాణిస్తున్న ప్రాంతం మలుపుగా ఉందని ఈ అన్‌బ్రోకెన్ లైన్స్ సూచిస్తాయి. ఇవి ఉన్న చోట ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు. ఎదురుగా వెళుతున్న వాహనం వెనుకాల క్యూ పద్ధతిలో వెళ్లాలి. ఈ లైన్లు ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేస్తుంటారు. ఒకవేళ అన్‌బ్రోకెన్ లైన్ కుడి చేతి వైపు ఉంటే ఓవర్‌టేక్ చేయ వచ్చని అర్థం. ఎడమ చేతివైపు ఉంటే ఓవర్‌టేక్ చేయకూడదని అర్థం.

పీలేరులో ఆర్డీఓ విస్తృత పర్యటన



పీలేరు-మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు

పీలేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ గురువారం పీలేరులో విస్తృతంగా పర్యటించారు. రీ-సర్వే జరుగుతున్న గూడరేవుపల్లెను సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పీలేరు పంచాయతీ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయంలో మొక్కలు నాటారు. సినిమా థియేటర్ లైసెన్సు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న జీవీసీఎస్ఆర్ థియేటర్‌ను తనిఖీ చేశారు. పీలేరు-తిరుపతి మార్గంలోని రజకుల గుట్ట వద్ద ఏపీ టూరిజం శాఖకు కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. ఆర్వోబీ నిర్మాణానికి అడ్డంకిగా మారిన రైల్వే లెవల్ క్రాసింగ్ స్థల మార్పుపై కొత్త ప్రదేశాన్ని పరిశీలించారు. రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే కొత్త లెవల్ క్రాసింగ్ పనులు ప్రారంభించాలని ఆర్వోబీ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. పీలేరు వారపు సంత వద్ద వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూఆక్రమణలను పరిశీలించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు భీమేశ్వరరావు, సర్వేయర్లు కీర్తన, ప్రభంద, వీఆర్వోలు సిద్దయ్య, రెడ్డిశేఖర, సుధాకర్, కల్యాణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి ప్రతిభ అవార్డులు



కలికి విద్యార్థినీలు శిరీష, దివ్య, లక్ష్మీప్రియ, సలోని

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల స్థాయిలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులను ప్రకటించినట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జీవన్‌కుమార్, గోవర్ధనరెడ్డిలతో పాటు ఎ.లక్ష్మి (గురుకుల పాఠశాల), ఎల్.దివ్య (గురుకుల పాఠశాల), బి.శిరీష (గురుకుల పాఠశాల), ఎ.సలోని (కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాల)లకు ఈ ఏడాది ప్రభుత్వ ప్రతిభ పురస్కారాలు దక్కాయి. డాక్టర్ అబ్దుల్‌కలాం ప్రతిభ అవార్డుల పేరుతో ఆరుగురు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయనుంది.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం మద్దిరేవుల గ్రామంలోని శివమ్మ అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయంపై ఆచరణాత్మక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, ప్రతి రైతు ప్రకృతి పరమైన, మన చుట్టూ దొరికే వ్యవసాయ ఎరువులను పొలాలకు ఉపయోగించాలన్నారు. చెరువు మట్టి, ఆవు, బర్రెల పేడతో తయారు చేసిన ప్రకృతి ఎరువులను పొలాలకు ఉపయోగించాలన్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం వంటి ప్రక్రియలను పంటకు ఉపయోగించాలన్నారు. రాష్ట్ర సీనియర్ టిమాటిక్ లీడ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ మామిడిలో పంట కోసిన తర్వాత పనికిరాని కొమ్మలను తీసివేసి పొలాన్ని దుక్కులు చేసి చెట్టుకు ప్రకృతి ఎరువులను ఉపయోగిస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు.

రూ.26 లక్షలతో రైతుబజారు ఏర్పాటు

- రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : ఏడీ

పీలేరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పీలేరులో రూ.26 లక్షలతో రైతు బజారు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ త్యాగరాజు తెలిపారు. గురువారం ఆయన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు రైతుబజారు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజారును మార్కెట్ కమిటీ ఆవరణలో లేదా సీఎల్ఆర్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజారు ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పండించే పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్నీ రైతు బజారు ద్వారా అందిస్తామన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో టమోటా మార్కెట్ పునఃప్రారంభించడానికి రైతులు, వ్యాపారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అన్నమయ్య జిల్లా పరిధిలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, అన్ని పనితీరు భేష్‌గా ఉందన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామూర్తి, డైరెక్టర్లు రహంతుల్లా, వనిత, అనురాధ ఉన్నారు.

ఏడాది పాలనలో రూ.40 కోట్లతో అభివృద్ధి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో రూ.40కోట్లతో మదనపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మదనపల్లెను నాశనం చేశారని, దీన్ని బాగు చేసేందుకు నిత్యం కష్టపడుతున్నామన్నారు. నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, అధికారులతో సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తున్నామన్నారు. 22ఏ నిషేదిత భూములు కాజేయడం, ల్యాండ్, సాండ్, శాండిల్ మాఫియాతో ఐదేళ్ల పాటు రెచ్చిపోయిన వైసీపీ ఎమ్మెల్యేలు మంత్రులు ప్రతి రోజు ప్రజలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు సిగ్గుతో తలదించుకోవాలని విమర్శించారు. ఇసుకకు అధిక ధరలతో ప్రజలను దోపిడ చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక మదనపల్లెలో రూ.16వేలకే ట్రిప్పర్ ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్జే వెంకటేశ్, మోడెం సిద్దప్ప, నీలకంఠ, బాలుస్వామి, నాగూర్‌వలి, నాదెళ్ల శివన్న, ఎస్ఎం రఫీ, నవీన్, జంగాల రమణ, శశికుమార్, తలారి రాధ, పులి మహాలక్ష్మి, బైగారి భారతి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యంతో బక్రీద్ జరుపుకోవాలి : సబ్ కలెక్టర్



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, జూన్ 5: మదనపల్లె డివిజన్‌లో బక్రీద్ పండుగను మత సామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో హిందూ, ముస్లీం సభ్యులతో కూడిన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు ఖుర్బాని పబ్లిక్ స్థలాల్లో నిర్వహించకూడదని, వీటికి కేటాయించిన స్థలాల్లోనే నిర్వహించాలన్నారు. ఇళ్ల వద్ద ఖుర్బాని ఇచ్చే వారు వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా, పరిశుభ్రత పాటించాలన్నారు. పండుగ రోజు సామూహిక సమావేశాలు నిర్వహించినప్పుడు సున్నితమైన అంశాలను సోషల్ మీడియాలో పోస్టు చేయకూడదని, గతంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన వారిని గుర్తించి పోలీసులు బైండోవర్ చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ మహీంద్ర మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా చీకిలబైలు, సర్కారుతోపు, ములకలచెరువు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో డీఎవో రాఘవేంద్ర, ఇన్‌చార్జి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సీఐలు ఎరిషావలి, జీవన్ గంగాధర్‌బాబు, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్ పల్లవి, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుండ్లూరు మూలస్థానమ్మ జాతర

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుండ్లూరు మూలస్థానమ్మ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. జాతర నిర్వహణపై వివాదాలు రేగిన సంగతి తెలిసిందే. అమ్మవారి జాతర నిర్వహణకు రెండు వర్గాలు పోటీపోటీగా వేర్వేరు తేదీలు ప్రకటించి వివాదం పోలీసు స్టేషను వరకూ చేరిన సంగతి కూడా విదితమే. ఎట్టకేలకు గతంలో జాతర నిర్వహించిన వారే తిరిగి ఈ ఏడాది నిర్వహించేందుకు అంగీకారానికి రావడంతో వివాదం ముగిసింది. దీంతో ముందుగా ప్రకటించినట్లు శనివారం సిద్దపూజ, జాగారం తోపాటు రాత్రి బయనేని వారిచే శ్రీమూలస్తానమ్మ హరికథను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం దివ్వెలు, బోణాలు, చాందినీ బండ్లు, చెక్క భజనలు, పిల్లనగ్రోవుల భజనలు జరుగనున్నాయి. సోమవారం రాత్రి పుష్పపల్లకి సేవ, అమ్మ వారి ఊరేగింపు ప్రత్యేకంగా నిలవనున్నాయి. ఇందుకనువుగా రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో ఆలయ పరిసరాలను దేదీప్యమానం చేయనున్నారు. వివిధ మండలాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు తరలిరానున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సన్నాహాలు కూడా మొదలు పెట్టారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన దొరబాబునాయుడు

సంబేపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల గ్రామం గంగన్నగారి ఇళ్ల సమీపంలో గురువారం స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒంటిమిట్ట దొరబాబునాయుడు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రౌతుకుంట గ్రామం పోతువాండ్లపల్లెకు చెందిన దొరబాబునాయుడు తమ బంధువుల పిల్లల బియ్యం కార్డు, ఆధార్, ఈకేవైసీ అప్డేట్ కొరకు శెట్టిపల్లి సచివాలయానికి వెళ్లారు. పని ముగించుకొని తమ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా శెట్టిపల్లి వైపు నుంచి వస్తున్న కారు గంగన్నగారి ఇళ్ల సమీపంలో స్కూటర్‌ను వెనుకవైపు ఢీకొనడంతో పిల్లలకు స్వల్పగాయాలు కాగా దొరబాబుకు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దొరబాబును మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

గంజాయితో జీవితం నాశనం

- బాలల సంరక్షణ జిల్లా అధికారి వినోద్‌కుమార్



అప్పయ్యరాజుపేటలో డ్రగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వినోద్‌కుమార్

పుల్లంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏది తప్పో ఏది ఒప్పో తెలియని వయస్సులో చిన్నారులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామంలో కేజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ఉపసర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అర్ధరాత్రి వేల యువకులు భయంకరమైన శబ్దాలతో బైకు రైడింగ్, గంజాయి స్మోకింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న వయస్సులో డ్రగ్స్‌కు అలవాటు పడి జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఇందువల్ల తల్లిదండ్రులకు కూడా చెడ్డపేరు వస్తుందని తెలిపారు. డ్రగ్స్ ద్వారా ఏమైనా సమస్యలు వస్తుంటే తమకు తెలియజేయాలని, లేనిపక్షంలో 1098 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎస్ఐ శివప్రసాద్, బాలల సంరక్షణ అధికారులు పీఓఐసీ రామలక్ష్మీ, బి.వెంకటకుమార్, సోషల్ వర్కర్ శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఇళ్లలో ఓ యువకుడు అనారోగ్య కారణంతో ఉరేసుకుని మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మూడేళ్ల క్రితం కొత్త ఇళ్లకు చెందిన హరిప్రసాద్(32)కు పుంగనూరు మండలం, చదళ్లకు చెందిన నాగవేణితో వివాహమైంది. ఏమైందో ఏమో తెలియదు కానీ వారం రోజుల క్రితం భార్యను వారి అమ్మగారి ఇంట్లో వదిలి వచ్చాడు. బుధవారం రాత్రి తన ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న భార్య తరపు బంధువులు కొత్త ఇళ్లకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా మృతుడికి రెండేళ్ల కుమారుడు ఉన్నట్లు తెలిసింది.


ప్రతిభా అవార్డులకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

మదనపల్లెటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డులకు మదనపల్లెకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ప్రకటించిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతులు అందజేయనున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలోని విజయభారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రెడ్డి సుదీప్, మనోజ్ఞ ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని, వీరికి రూ.25 వేల చొప్పున నగదు బహుమతి అందనుందని ప్రిన్సిపాల్ ఎస్.సేతు తెలిపారు.

ఆడ బిడ్డలకు ఆలంబనగా..

- ప్రభుత్వ బాలికాసదన్
- అమ్మ లేని లోటు తీరుస్తున్న సిబ్బంది

అభం శుభం తెలియని వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు.. తల్లీ తండ్రి ఉన్నా ఆదరణ కరువైన బాలికలకు స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్వహిస్తున్న బాలికాసదన్ తోడు నీడగా నిలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పిల్లలను తమ పిల్లలే అన్న భావనతో సేవలందిస్తూ వారిలో ప్రేమానురాగాలు నింపుతున్నారు. దీంతో పిల్లలు కూడా సిబ్బందిని అమ్మ అని పిలుస్తూ ఆప్యాయత పంచుతున్నారు.



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లి తండ్రి లేని అనాథలను, నిరాదరణకు గురైన బాలికలను నేరుగా వారి బంధువులు, గ్రామ పెద్దలు బాలికాసదన్‌లో చేరుస్తారు. అదే విధంగా ఎక్కడైనా అను మానాస్పదంగా తిరుగుతున్న పిల్లలను బాలల సంరక్షణ సంస్థ వారు గుర్తించి అక్కడ చేర్పించడం జరుగుతుంది. 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న పిల్లలు ఇక్కడ చేరవచ్చు. వీరిని సమీపంలోని పాఠశా లల్లో చేర్పించి చదివిస్తారు. 5వ తరగతి పూర్తి చేసిన అమ్మాయిలను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చేర్పిస్తారు. అక్కడ చేరిన పిల్లలకు వసతి సౌకర్యం అక్కడే ఉంటుంది. అయితే పాఠశాలలు కళాశాలల్లో చదివే పిల్లలకు వేసవి పండుగ సెలవులు వచ్చినప్పుడు వారిని తిరిగి బాల సదనానికే తీసుకువస్తారు. వారు విద్య పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడేంత వరకు స్త్రీ శిశు సంక్షేమశాఖ సదన్‌లోనే ఉంటారు.

18 ఏళ్లు నిండిన తరువాత

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాలిక సదన్‌లోనే 18 సంవత్సరాల వయసు వచ్చే వరకు ఆశ్రయం పొందవచ్చు. కానీ ఒక అమ్మాయి డిగ్రీ రెండు సంవత్సరాలు పూర్తి అయింది. ఇక ఒక సంవత్సరమే ఉండడంతో ఉన్నతాధికారుల అనుమతితో కడప నగరంలోని బాలిక సదన్‌లో ఆశ్రయం కల్పించి విద్యనభ్యసించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పుట్టినరోజులు, పెళ్లి రోజు వేడుకలతో కొంత మంది స్వచ్ఛందంగా ఇక్కడున్న బాలికలకు అన్నదానం, కానుకలు ఇచ్చే సంప్రదాయానికి అధికారులు స్వస్తి పలికారు. కొన్ని సందర్భాల్లో దాతలు తమ పిల్లల పుట్టిన రోజు వేడుకల్లో నానా హంగామా సృష్టిస్తుంటారు. ఆ సమయంలో తమకు కూడా తల్లిదం డ్రులు ఉంటే ఇలాగే వేడుకలు చేసేవారేమో అనే భావన ఆ పిల్లల్లో కలగకుండా ఉండేందుకు తాము ఈవిధానం ప్రోత్సహించడం లేదని స్థానిక సిబ్బంది చెబుతున్నారు.



ఆదుకోవడం మా బాధ్యత

అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించి ఆదుకోవడం మా బాధ్యత. వారికి అమ్మనాన్న లేని లోటు తీరుస్తున్నాం. 18 మంది పిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ప్రాథమిక విద్య అయిపోయిన తరువాత వేరే పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలికలను వేసవి సెలవులకు ఇక్కడికే తీసుకువస్తాం.
వి.శారదదేవి, సూపరింటెండెంట్, బాలికాసదన్, కడప

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది... రాణి (పేరు మార్చాం)

మాది రాజంపేట వద్ద ఒక గ్రామం. నా ఏడవ ఏట మా నాన్న చనిపోయారు. ఆ తరువాత రెండు నెలలకే మా అమ్మ కూడా చనిపోయింది. మేం నలుగురు అక్కాచెల్లెళ్లం. మాకు ఎవరూ ఆశ్రయం కల్పించకపోవడంతో కడపలోని బాలికాసదన్‌కు చేరుకున్నాం. ప్రస్తుతం నేను 8వ తరగతి చదువుతున్నాను. నా సోదరీమణుల్లో ఇద్దరు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతన్నారు. మరో క సోదరి ఐదో తరగతి పూర్తయింది. పాఠశాలలు తెరవగానే ఆరవ తరగతిలో చేర్పించాల్సి ఉంది. బాగా చదవి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

పీజీ వరకు చదవాలని ఉంది.. మంజుల

నాకు ఐదేళ్ల వయసులో అమ్మ, నాన్న చనిపోయారు. దీంతో నేను, నా సోద రుడు అనాథలయ్యాం. కొంత మంది మమ్మల్ని డాడీ హోంలో చేర్పించారు. మా తమ్ముడు విజయవాడలోని ఓ హోంలో ఉన్నాడు. 1వ తరగతి నుంచి 9 వరకు డాడీ హోంలో విద్యను అభ్య సించాను. దత్తత కార్యక్రమం కింద గుంటూరు జిల్లా వారు నన్ను దత్తత తీసుకున్నారు. కానీ వారు బాగా చూసు కోకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశాను. దీంతో నన్ను కడపలోని బాలికా సదన్‌కు తీసకువచ్చారు. కడప నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాను. భవిష్యత్తులో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలనేది నాకోరిక.

లారీ- స్కూటరు ఢీ.. వీఆర్వో మృతి



ఈశ్వరయ్య (ఫైల్‌ఫొటో)

కమలాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో గురు వారం జరిగిన ప్రమాదంలో పొలతల ఈశ్వ రయ్య (59) మృతి చెందారు. మండలంలోని పాచికలపాడు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కమలాపురం 1వ సచివాలయంలో వీఆర్వోగా, చదిపిరాళ్ల సచివాలయంలో ఇన్‌చార్జ్ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన కమలాపురం వైపునకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా వెనక భాగాన లారీ ఢీకొంది. దీంతో ఈశ్వరయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న డీలరు నాని స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు ఈశ్వరయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, రాణికుమారి మృతదేహం

సీకేదిన్నె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామానికి చెందిన చరసాల రాణికుమారి (52) సరస్వతిపల్లెలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. గురువారం ఆమె స్వగ్రామానికి వెళ్లి ప్రస్తుతం నివశిస్తున్న కడప నగరం రాఘవేంద్ర టౌన్‌షిప్ వద్దకు వస్తుండగా బుగ్గలేటిపల్లె సమీపంలో ప్రమాదం జరిగింది. రాణికుమారి ప్రయాణిస్తున్న కారును గుర్తు తెలియని వాహనం వెనుకవైపు స్వల్పంగా ఢీకొనడంతో కారు రివర్స్ తిరిగింది. దీంతో వెనుక వస్తున్న అన్నమయ్య జిల్లా డిప్యూటీ డెమో ఆఫీసర్ దేవశిరోమణి ప్రయాణిస్తున్న కారు రాణికుమారి కారును ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. దేవశిరోమణి కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఉపాధ్యాయురాలు రాణికుమారికి భర్త సోమా పుల్లయ్య , ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిసింది. ఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

లింగాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గవిరెడ్డి శివారెడ్డి(60) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకెళితే... శివారెడ్డికి అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడం, గతంలో ఆయన భార్య ప్రమాదంలో మరణించడం, కుమారుడు విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ప్రస్తుతం శివారెడ్డి తల్లి గంగమ్మ(80)తో కలిసి నివాసం ఉంటున్నారు. తల్లి గంగమ్మ నడవలేని స్థితిలో ఉంది. తల్లి సంరక్షణ చూసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల శివారెడ్డికి ఆరోగ్య సమస్యలు తీవ్రం కావ డంతో మనస్థాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

లారీ నిలిపి దోపిడీ... కేసు నమోదు

ముద్దనూరు జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప, తాడిపత్రి హైవే రోడ్డులోని చౌటిపల్లె గ్రామ సమీపం వద్ద జరిగిన దుండగులు లారీ నిలిపి దోపిడీకి సంబంధించి గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల సమాచారం మేరకు తాడిపత్రి మండలం గోసువారిపల్లెకు చెందిన లారీ డ్రైవర్ గంగరాజు లారీతో మే31 వ తేదీ రాత్రి ముద్దనూరు వైపు వస్తున్నాడు.చౌటిపల్లె గ్రామం వద్దకు రాగానే నల్ల స్కార్పియోలో దాదాపు 8 మంది దుండగులు వచ్చి లారీకి అడ్డంగా పెట్టి నిలిపి డ్రైవర్ ను కొట్టి రూ.2వేలు నగదు దొచికొని, మొబైల్‌ను పగలగొట్టారు.డ్రైవర్ అదే రోజు రాత్రి ఫిర్యాదు చేసి, ఆసుపత్రికి వెళ్లాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.దీనికి సంబందించి స్కార్పియో, ఓనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. గురువారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి ఏపీ హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్ఎస్‌సీ సెలక్షన్ పోస్టులు, ఆర్ఆర్‌బీ గ్రూప్-డి, ఎన్‌టీపీసీ ఉద్యోగాలకు 10వ తేదీ నుంచి సబ్జెక్టు నిపుణులతో శిక్షణ ఇస్తామని తెలిపారు.

అల్ట్రాటెక్ వద్ద కాంట్రాక్టు కార్మికుల ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- యాజమాన్యంతో చర్చలు విఫలం





ర్యాలీగా వస్తున్న కార్మికులు, గేటు మూసివేసిన సెక్యూరిటీ సిబ్బంది

ఎర్రగుంట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం వద్ద కాంట్రాక్టు కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు గత నెల రోజులుగా విధులు బహిష్కరించారు. కలెక్టర్‌కు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. అయితే ఇప్పటి వరకు డిమాండ్లు పరిష్కరించకపోవడంతో సాయంత్రం మెయిన్‌గేటు వద్ద కార్మికులు బైటాయించారు. కార్మిక సంఘం నాయకులు జంగం రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శేఖర్ తదితరులు ప్లాంట్ వీపీ మారిముత్తు, హెచ్‌ఆర్ అధికారి థామస్‌తో చర్చలు జరిపారు. అయితే సమస్యల పరిష్కారంలో సయోధ్య కుదరకపోవడంతో వారు ధర్నా కొనసాగిస్తున్నారు. విద్య, వైద్య సదుపాయలు కల్పిండం లేదని, గ్రామాల చుట్టూ కాలుష్యం వ్యాపించడం వల్ల క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు సీఎస్ఆర్ నిధులు కేటాయించడం లేదన్నారు. కార్మికులకు ఇప్పటి వరకు గ్రేడ్లు, ఇంక్రిమెంట్లు మార్పు చేయ లేదన్నారు. కరోనా సమయంలో తొలగించిన సుమారు 100 మంది కార్మికులను తిరిగి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా, కార్మికుల ధర్నాపై సీఐ నరేష్‌బాబు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఇబ్బందుల్లేకుండా ఆందోళన చేసుకోవాలని తాము ఆదేశించినట్లు తెలిపారు. కొంతమంది నాయకులు యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ధర్నా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, దుంగలతో పోలీసులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. బ్రహ్మంగారిమఠం వయా మైదుకూరు మిట్టమానుపల్లె అటవిప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను దాచి ఉంచి రవాణా చేసేందుకు సిద్దంగా ఉంచారని, విషయం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అక్కడ ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర ప్రమాణ స్వీకారం

మైదుకూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం స్థానిక కడప రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతున్నారని తెలిపారు.

అధిక దిగుబడుల కోసం శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

రాజుపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవాలని కేవీకే అధిపతి బాలకృష్ణ తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని రాజుపాలెం, చిన్నశెట్టిపల్లె, టంగుటూరు, అయ్యవారిపల్లె, వెంగలాయపల్లె, తొండలదిన్నె, ఏరువపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ తరపున వచ్చిన సుబ్బరాయుడు, శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ జొన్న, మొక్కజొన్న, కొర్రల్లో మేలైన రకాలు, వాటి యాజమాన్య పద్ధతులపై వివరించారు. డాక్టర్ భగవత్ వరి, పత్తి, మిను ము రకాల్లో సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగంపై, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ పృధ్వీధర్‌రెడ్డి పశువులలో అధిక పాల ఉత్పత్తి, పోష ణ, వ్యాధినిరోధక టీకాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల వద్ద మొక్కలు నాటారు.

దుంపలగట్టులో వ్యక్తి ఆత్మహత్య

- పోలీసులే కారణమంటూ భార్య ఆరోపణ





ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతదేహం, నారాయణరెడ్డి (ఫైల్)

ఖాజీపేట/ కడప క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే తన భర్త మృతికి పోలీసులే కారణమంటూ మృతుడి భార్య ఆరోపిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. దుంపలగట్టుకు చెందిన రెడ్యం శివలక్ష్మీనారాయణ రెడ్డి (40) గంజాయి కేసులో నిందితుడు. ఈ మేరకు ఇతనికి కోర్టు 50 రోజులు శిక్ష విధించింది. శిక్ష అనంతరం ఇటీవల బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక పుష్పగిరికి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని ఇతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఇతను తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతూ వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అప్పటికే చనిపోయాడు. ఈ మేరకు పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో వారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. గురువారం రిమ్స్ వద్ద మృతుడి భార్య రెడ్యం సుభాషిణి మాట్లాడుతూ.. తన భర్త ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమని పేర్కొన్నారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెడ్యం శివలక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు బాధితుల ఫిర్యాదు మేరకు ఖాజీపేట హెడ్ కానిస్టేబుల్ సుబ్బయ్య కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ బాధ్యతలను మైదుకూరు సీఐ రమణకు అప్పగించినట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. కాగా, ఖాజీపేట పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడంతోనే లక్ష్మీనారాయణరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వైసీపీ నేతలు ఆరోపించారు. ఆయన ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం ఎస్పీ బంగ్లాలో వైసీపీ జిల్లా అధ్య క్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలు కలిశారు.

అనంతపురం, చిత్తూరు జట్ల విజయం





లోహిత్ లక్ష్మీనారాయణ (112 పరుగులు), మహేంద్ర (67 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-23 పురు షుల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా గురు వారం అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి 38.1 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో నయీముల్లా 59 పరుగులు, ఖానిష్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టు కేవలం 34.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసి విజయభేరి మోగిం చింది. ఇందులో మహేంద్రరెడ్డి 67, అర్జున్ టెండూల్కర్ 40 పరుగులు చేశారు. అలాగే ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 296 భారీ స్కోరు సాధించింది. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 112 పరుగులు సాధించడం విశేషం. అనంతరం బరిలో దిగిన నెల్లూరు జట్టు 42.2 ఓవర్లలో 202 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో మన్విత్‌రెడ్డి (52) పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 94 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7.92 కోట్లు మంజూరు

దువ్వూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కలెక్టర్ ద్వారా రూ.7.92 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దువ్వూరు మండలానికి రూ.1.66 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పలు గ్రామాల్లో 20 చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించనున్నారు. అదే విధంగా బి.మఠం మండలానికి 21 పనులకు రూ.1.57 కోట్లు, చాపాడు మండలానికి 38 పనులకు రూ.1.29 కోట్లు, ఖాజీపేట మండలానికి 35 పనులకు రూ.1.96 కోట్లు, మైదుకూరు ప్రాంతానికి 25 పనులకు రూ.1.47 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి అయిదు మండలాలకు రూ.7.92 కోట్లు నిధులు కేటాయించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని డీఎస్పీ భావన పేర్కొన్నారు. గ్రంథాలయాల ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగిన సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వాట్సాప్ ద్వారా డీఎస్పీ భావన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. గ్రంథాలయాల ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు మునిశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, డీకే చదువులబాబు, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని నెహ్రూనగర్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఆటో-జీపు ఢీకొనడంతో ఆంజనేయులు, జీపు డ్రైవర్‌కు తీ వ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... అంజనేయులును ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేడుకగా కోర్టులో గంగమ్మ జాతర



పట్టణంలో ప్రత్యేక వాహనంపై ఊరేగుతున్న కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మ జాతర బుధవారం రాత్రితో ముగిసింది. ఉదయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గంగమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. మహిళలు చీరలు, జాకెట్లు, దీలుతోపాటి పసుపు కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి ప్రత్యేక వాహనంలో అమ్మను అలంకరించి చెక్క భజనలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా పేలుళ్లతో పట్టణంలో ఊరేగించారు. అనంతరం గంగమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాళెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, కోశాధికారులు మార్పూరి మహేష్, బోయపాటి శ్రీనివాసులు, సభ్యులు జోలెపాళెం దేవేంద్ర, చిన్నరెడ్డెప్ప, కృష్ణకుమారి, మార్పూరి చెన్నారెడ్డి, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, మార్పూరి మల్లికార్జున నాయుడు, తాళ్ల శ్రీనివాసులు నాయుడు, రాటకొండ రంగస్వామి నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వాల్మీకిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి పేర్కొన్నారు. వేసవి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అతిథులు పర్వీన్ సుల్తాన, దుర్గ, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

కలకడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవాలని గ్రంథాలయాధికారి అమరనాథ్ అన్నారు. గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ గురువారంతో ముగిసిందన్నారు. కథల పుస్తకాలు, దినపత్రికలు చదవడం, జనరల్ నాలెడ్జ్‌పై పిల్లలకు అవగాహన నిర్వహించినట్లు చెప్పారు. వారిలో ఉత్సాహం నింపేందుకు క్యారమ్స్, చెస్, లూడో ఆటలను ఆడించామన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

గ్రంథాలయాలతోనే అపార విజ్ఞానం

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు వెళ్లడం దినచర్యగా అలవర్చుకుంటే అపార విజ్ఞానం సమకూరుతుందని ప్రముఖ కవి, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు వేంపల్లె అబ్దుల్ ఖాదర్ చెప్పారు. విద్యార్థి జీవితాన్ని పుస్తకాలు ఎంతో ప్రభావితం చేస్తాయని తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు సమావేశంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి విజయకుమార్, విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

25శాతం రిజర్వేషన్ కల్పించాలి



ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులను భాష్యం పాఠశాలలో చేర్పిస్తున్న సీఎంఓ కరుణాకర్

మదనపల్లె టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం విద్యార్థులకు ఉచితంగా విద్య అందించాలని సమగ్ర శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి(సీఎంఓ) కరుణాకర్ పేర్కొన్నారు. గురువారం పలు ప్రైవేటు పాఠశాలలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో ఇద్దరు చేనేత కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఎంపిక చేసి ప్రైవేటు పాఠశాలలో చేర్పించామన్నారు. జిల్లాలో 456 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి విడత లాటరీ పద్ధతిలో 389 మంది విద్యార్థులను ఉచిత విద్య అందించడానికి ఎంపిక చేశామన్నారు. ఇలా ఎంపికైన విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు ఆయా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్ పొందాలన్నారు. గడువు ముగిస్తే వారికి సీటు రద్దు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, సీఆర్‌పీలు ఫణి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తప్పని సరి



పీలేరులో యోగా సాధన చేస్తున్న అధికారులు

పీలేరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తప్పనిసరని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. గురువారం పీలేరు పంచాయతీ ఆవరణలో యోగాంధ్రలో భాగంగా వంద మందితో యోగా సాధన చేశారు. 7న ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణలో 1500 మందితో మెగా యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్, ఈఓ గురుమోహన్, యోగా థెరపిస్టు డాక్టర్ లక్ష్మీ, స్వర్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

మదనపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. విధులు బహిష్కరిస్తూ నిరవధిక సమ్మెలో పాల్గొంటామని ప్రకటించారు. వారు మాట్లాడుతూ 15 ఏళ్ల సర్వీసు ఉన్న వారికి రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్మికుల పని సమయంను ఎనిమిది గంటలకే పరిమితం చేసి పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పనిచేయలేని అధికారులను బదిలీ చేయండి

మదనపల్లె టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో పనిచే యలేని అధికారులను బదిలీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. పట్టణంలో అధిక ఫీజులు, నిబంధనలు అతిక్రమించి విద్యార్థులను దోపిడీ చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోలేని ఎంఈఓను బదిలీ చేయాలని కోరారు. స్థానిక ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలపై ఎస్ఎఫ్ఐ నేతల ఫిర్యాదుపై ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. జరుగుతున్న అక్రమాలను ఎస్ఎఫ్ఐ నేతలు బహిర్గతం చేసినా ఎంఈఓ తన చేతకాదని చెప్పి వెళ్లిపోయారని ఆరోపించారు. డీఈఓ, ఆర్‌జేడీ చర్యలు తీసుకోని పక్షంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నేతలు అఫ్రీద్, జయబాబు, ప్రేమ్‌కుమార్, సుల్తాన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. మనబాధ్యత

వేడుకగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
మొక్కలు నాటిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఆర్డీఓ శ్రీనివాస్



రామారావుకాలనీ వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ ప్రమీల - పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు

మదనపల్లె టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యతని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక రామారావుకాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణం కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మదనపల్లెలో ప్రతి వారం ఒక ప్రాంతంలో మొక్కలు నాటుతున్నామని, ఇప్పటి వరకు 50వేల మొక్కలు నాటామన్నారు. వీటిని కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై వుందన్నారు. సీటీఎం పంచాయతీలో ఉపాధికింద కోనేటి పూడిక తీతను ఎమ్మెల్యే ప్రారంభించి, మొక్కలు నాటారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బరోడా బ్యాంకు సహకారంతో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఆదిత్య కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్వీ యూనివర్శిటీ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో మదనపల్లె శ్రీజ్ఞానాంబి క డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఐశ్వర్య, మైథిలి, శ్రీలేఖ విజయం సాధించారు. వర్శిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కోఆర్డినేటర్ వివేక్ సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

పీలేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. అటవీ శాఖ సహా ఇతర శాఖలు పర్యావరణ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. పీలేరు రేంజ్ పరిధిలోని పీలేరు, కేవీపల్లె మండలాల్లో ఎఫ్ఎస్ఓ సబిహా సుల్తానా నేతృత్వంలో ఎఫ్‌బీఓలు శ్రీనివాసన్ స్వామి, రెడ్డి ఆసియాబీ, చంద్రకళ, జగదీశ్ పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. పీలేరు పంచాయతీ, తహసీల్దారు కార్యాలయంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఏపీట్రాన్స్‌కో పీలేరు ఈఈ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో ట్రాన్స్‌కో సిబ్బంది కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పీలేరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా పీలేరు ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు సురేంద్రా రెడ్డి విద్యార్థులచే విరివిగా మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పీలేరు మెయిన్ పాఠశాలలో 29వ బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు ఉపాధ్యాయులు శ్రీరాములు, రెడ్డెప్ప, డాక్టర్ జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిమ్మనపల్లె...

నిమ్మనపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవా లని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌లు, విద్యార్థులు మొక్కలు నాటారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): యోగి వేమన గురుకుల పాఠశాల ఆవరణలో బురకాయలకోట సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ షబీన్‌తాజ్ మొక్కలు నాటారు. కురబలకోట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మదనపల్లె డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మైనార్టీ గురుకుల బాలికల కళాశాల, సచివాలయాలు, తదితర చోట్ల మొక్కలు నాటారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మనోహర్‌రాజు, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ సునీల్, అధికారులు, ఉపాధ్యాయులు, పం చాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, మెడికల్ ఆఫీసర్ ఆరీఫ్ పేర్కొన్నారు. కమిషనర్ పల్లవి ఆధ్వర్యంలో చెరువుకట్టపై, మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ పర్యవేక్షణలో హార్సిలీహిల్స్ అటవీశాఖ సముదాయంలో మొక్కలు నాటారు. పలువురు నేతలు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పేర్కొన్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల జూనియర్ కాలేజీ సమీప ప్రాంతంలో అధికారులు మొక్కలు నాటారు. గుజరాత్ స్వచ్ఛంద సంస్థ ఎఫ్ఈఎస్ సభ్యులు అమీర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో...

రామసముద్రం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీడీఓ భానుప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సచివాలయాలు, డంపింగ్ యార్డ్ పరిసరాల్లో మొక్కలు నాటారు. మాలేనత్తం సచివాలయం, పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది టీడీపీ నేత రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఏపీఓ మాధవి, మండల టీడీపీ యువ నేత రూపేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, పంచాయతీ సెక్రటరీ మునిస్వామినాయక్, అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, సర్పంచులు, విద్యార్థులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక్కో చెట్టును నాటుదామని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. గ్రామంలో ఉపాధి ద్వారా చేపట్టిన ఫారంపాండ్ గుంతల వద్ద చెట్లు నాటారు. భూమి, గాలి, నీరు ఉన్న చోట మొక్కలు, చెట్లు జంతువులు ఉంటేనే సహజ సిద్ధమైన వాతావరణం ప్రకృతి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజినప్ప, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో...

గుర్రంకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నౌషాద్‌అలీ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా అన్ని సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. ఎంపీడీఓ వెంకటేశులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కల్పించాలి

కలకడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాయితీతో ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. గురువారం కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ పథకాన్ని గృహ వినియోగదారులు ఉపయోగించుకోవడం వలన నెల వారీ విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. పైకప్పు విస్తీర్ణాన్ని బట్టి 1-3 కిలో వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశంఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పురుషోత్తంరెడ్డి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల ఆదా

తంబళ్లపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలను(సోలార్ రూఫ్‌టాప్) ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర సూచనల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకోవడంపై అవగాహన కల్పించారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణం మంజూరవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి శ్లాబ్‌లపైన సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజినప్ప, సచివాలయ సిబ్బంది, వెలుగు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్రిమిసంహారిణి వాడకం తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నిమ్మనపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టమాట పంటలో క్రిమిసంహారిణి వాడకం తగ్గించాలని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త మంజుల సూచించారు. రెడ్డివారిపల్లి పంచాయతీలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో రైతులకు ఉద్యాన పంటలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసిన భూముల్లో వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలన్నారు. లద్దు, ఎరపంటలు, ఫిరమోన్, నీలి, పసుపు, రంగు జిగురు వంటి సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కకు వేరుకుళ్లు రోగం రాకుండా ట్రైకోడర్మ మందును మొక్కలు నాటే ముందు వాడాలన్నారు. మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి పూత, పిందె సమయంలో కాకుండా మామూలు సమయంలో కూడా వుంటుందని జామలో అధికంగా పిండినల్లి వుంటుందని దీని నివారణకు తగు సూచనలు అందజేశారు. రైతులకు వరి వేరుశనగ, తృణ ధాన్యాల రకాలు కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో వుంటాయని కావలసిన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కృష్ణవేణి, నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియంతో అధిక లాభాలు

వాల్మీకిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకంతో పంటల దిగుబడిలో మంచి ఫలితాలు రాబట్టవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వకర్త డాక్టర్ మంజుల పేర్కొన్నారు. మూరేవాండ్లపల్లెలో వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీపీఏ శివ, ఏహెచ్‌ఏ మహేష్, ఉపసర్పంచ్ ద్వారకనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంలో ఊరేగిన లక్ష్మీనృసింహుడు



ఆంజనేయ వాహనంపై లక్ష్మీనరసింహుడు

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి వారు ఆంజనేయ వాహనంపై విహరించారు. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలను జనరంజకంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి తిరుమంజనం సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకి సేవలో భాగంగా ప్రత్యేక పల్లకిలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి దివ్య స్వరూపాన్ని దర్శించుకున్నారు. సాయంకాలం ఆంజనేయ వాహనంపై స్వామి వారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయంలో ఓం నమో నారసింహాయ నినాదాలు మిన్నంటాయి.

మండల పరిషత్ ఏఓగా శ్రీధర్

పెద్దతిప్పసముద్రం జూన్ (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్‌గా శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్‌గా నాగేంద్ర బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ నిత్యానంద్ ఉద్యోగ విరమణ పొందడంతో బంగారుపాళ్యం ఏఓ శ్రీధర్ పీటీఎంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రామచంద్ర పుంగనూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో నాగేంద్ర బాబు పెద్దమండ్యం నుంచి వచ్చారు.

బాధితుడికి రూ.25వేలు ఆర్థిక సహాయం

మదనపల్లె టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన పోతబోలు వీఆర్‌ఏ పోతన్న కుమారుడు రవికుమార్‌కు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల చెట్టుపైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవికుమార్‌ను పరామర్శించిన సర్పంచ్ ఈశ్వరయ్య, వైద్య చికిత్సలకు సొంత నిధులు రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

టీడీపీలోనే మైనార్టీలకు సముచిత స్థానం

గుర్రంకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే మైనార్టీలకు మంచి గుర్తింపు ఉందని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నౌషాద్‌అలీ అన్నారు. తరిగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ బడుగు, బలహీన, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కొన్ని వర్గాలకు మాత్రమే పదవులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు చంద్రబాబు, రాజన్న, వేణు, సుదర్శన్, హేస్సాన్, వలి, ఖాదర్, సిరాజ్, నరసింహులు, ధరణి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పీలేరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కేవీపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముంగర రెడ్డి ప్రదీప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2025- 26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి నుంచి 9వరకు మిగులు సీట్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు 10వ తేదీ నుంచి 20 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జాబితాను 23న ప్రచురిస్తామని, 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అడ్మిషన్ కోసం ఎంపికైన విద్యార్థుల జాబితాను 25వ తేదీన డీఈఓ ద్వారా ప్రకటిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన, ప్రవేశం 26న జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు ఘన సన్మానం

పీలేరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యవవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పురం రామ్మూర్తిని మహిళా డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కమిటీ కార్యాలయంలో కలిసి సన్మానించి స్వీట్స్ పంచారు. రైతులు, వ్యాపారులకు మెరుగైన వసతుల కల్పనకు సమష్టి కృషి తప్పనిసరని తెలిపారు. సన్మానించిన వారిలో డైరెక్టర్లు అనురాధ, వనిత, రహంతుల్లా, ఖాదర్ పాల్గొన్నారు.

వేరుశనగలో మిశ్రమ పంటగా కంది

కలికిరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగతో మిశ్రమ పంట గా కందిని సాగుచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని 'ఆత్మ' బీటీఎం అమృత్‌కుమార్ తెలిపారు. కలికిరి కేవీకే ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'లో భాగంగా గురువారం గుండ్లూరు పంచాయతీలో రైతు సదస్సు నిర్వహించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో 'ఆత్మ' చేపడుతు న్న కార్యక్రమాల గురించి అమృత్‌కుమార్ వివరించారు. పశు వైద్యాధికారి డాక్టర్ గిరినాథ్ మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాల గురించి విశదీకరించారు. సబ్సిడీతో పంపిణీ చేస్తున్న దాణాను పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. శాస్త్రవేత్తలు దేవకి, నవీన తదితరులు కూడా రైతులకు పలు సూచనలు చేశారు. పాడి రైతులు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.

నిమ్మనపల్లికి చేరిన సబ్సిడీ విత్తనకాయలు



వేరుశనగ విత్తనకాయలను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

నిమ్మనపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై అందించే వేరుశనగ విత్తనకాయలు గురువారం నిమ్మనపల్లి ఆర్బీకేలకు చేరినట్లు ఏఓ మురళీమోహన్ తెలిపారు. మండల రైతులకు ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలానికి మొత్తం 1100 క్వింటాళ్ల వేరుశనగ కాయలు వచ్చినట్లు తెలిపారు. వాటిలో కెసిక్స్ రకం(తెలుపు) 300 క్వింటాళ్లు, నారియణి రకం (ఎరుపు) 800 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. వీటిని త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరమత సహనం పాటించాలి : సీఐ



ముతవల్లీలు, మతపెద్దలతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

పీలేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ నిర్వహణలో పరమత సహనం పాటించాలని ముస్లిం మతవల్లి, మతపెద్దలకు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ విజ్ఞప్తి చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతసామరస్యం కాపాడుతూ పండుగ చేసుకోవాలని, ఇతర మతాలను కించ పరిచేలా ఎవరూ ఎటువంటి వ్యాఖ్యలు చేయరాదని, సోషియల్ మీడియాలో పోస్టింగులు పెట్టరాదని హెచ్చరించారు. ప్రభుత్వం అనుమతించిన జంతువులనే ఖుర్బానీ ఇవ్వాలని, ప్రభుత్వం నిషేధించిన ఆవులు, దూడలు, ఒంటెలను వధించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముతవల్లీలు అల్లావుద్దీన్, అతార్ చాన్‌బాషా, ఇబ్రహీం, అస్లం బాషా, బాబ్జీ, సాదిక్, షాబుద్దీన్, మహబూబ్‌బాషా, న్యాయసలహాదారు షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికర భోజనాన్ని వడ్డించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

కలకడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశా ల విద్యార్థులకు రుచికర భోజనాన్ని వడ్డించా లని ఎంఈఓ-2 రామచంద్రారెడ్డి డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన నిర్వాహకులకు సూచించారు. ఆదర్శ పాఠశాలను గురువారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ పాఠశాలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో వంటశాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలాంషావలి, రిజ్వానా పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

మదనపల్లె టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగం పొందిన మహిళలు నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.